

# ష..

- మూగబోయిన ఎన్నికల మైకులు
- ఓటర్లకు ప్రలోభాల ఎరలో అభ్యర్థులు
- పోల్ మేనేజ్‌మెంట్‌పై రాజకీయ పార్టీల దృష్టి

## ముగిసిన ప్రచారం

గుంటూరు, బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. కాగా చివరి రోజున ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, రోడ్ షోలు, సభలతో హోరెత్తించి ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. దీంతో ఎన్నికల మైకులు మూగబోయాయి. దాదాపు రెండు నెలలుగా ప్రచార హోరుతో దద్దరిల్లిన గ్రామాలు, పట్టణాలన్నీ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయాయి. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకోవడానికి చివరి ప్రయత్నంగా శనివారం సాయంత్రం వరకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఇంతకాలం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మండుటెండల్లో ప్రచారం చేసిన నేతలు రహస్య మంతనాలు, ప్రలోభాలపై దృష్టిసారించేందుకు ప్రణాళికలు రూపొందించుని రంగంలోకి దిగారు. పోలింగ్‌కు కొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున బూత్‌ల వారీగా బలాబలాలపై మరోమారు సమీక్ష జరుపుకునే పనిని ఆదివారం నేతలు చేయనున్నారు. ప్రతికూలంగా ఉన్న చోట్ల రహస్యమంతనాలు జరపడానికి ప్రణాళికలు రచించి దానికి అనుగుణంగా అడుగులు వేయనున్నారు. ప్రచార గడువు ముగియడంతో జెండాలు, కండువాలు లేకుండా గ్రామాల్లో, పట్టణాల్లో నేతలతో పాటు వారి అనుచరులు తిరగడానికి ప్రణాళికలు రచించారు. రాత్రివేళల్లో ఓటరు స్లిప్పుతో పాటు ఓటుకు రేటుతో నగదు పంపిణీని నేతల అనుచరులు పంచుతున్నారు. ఓటుకు రూ.1,500 నుంచి 2,000 వరకు ఇస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను ముమ్మరంగా చేశారు. మద్యం దుకాణాలకు సాయంత్రం 6 గంటల నుంచి ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు.

### సుదీర్ఘంగా ఎన్నికల ప్రక్రియ

ఈ దఫా ఎన్నికల ప్రచారం సుదీర్ఘంగా సాగింది. షెడ్యూల్ మార్చి 16న విడుదల కాగా నోటిఫికేషన్ నెలా రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 18న విడుదలైంది. అప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. గత ఎన్నికల్లో తొలి విడతలోనే పోలింగ్ జరగ్గా ఈ దఫా నాల్గో దశలో జరగబోతున్నాయి. రాజకీయ పార్టీలకు ఎక్కువ సమయం లభించడంతో నియోజకవర్గాల వారీగా సభలు, రోడ్ షోలను పార్టీల అధ్యక్షులు నిర్వహించారు. దాదాపుగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలల్లో ఏదో ఒక రూపంలో ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి తరపున ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తది తరులు తొలి అడుగు చిలకలూరిపేట నియోజకవర్గంలోని బొప్పూడి అంజనేయస్వామి పాదాల చెంత నుంచి ప్రచారం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రచార సభలు, రోడ్ షోలతో ప్రధాన పార్టీల నాయకులు హోరెత్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం పేరుతో బహిరంగ సభలు నిర్వహించారు. గుంటూరులో చంద్ర బాబు రోడ్ షోకు వేలాదిగా ప్రజలు హాజరై మద్దతు తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెనాలి, పొన్నూరుల్లో ప్రచార సభలు, రోడ్‌షోలు నిర్వహించి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను చైతన్య పరిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ షర్మిల గుంటూరు, బాపట్ల, చీరాల, రేపల్లెలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించారు. కాగా అధికార యంత్రాంగం రెండు నెలలపై నుంచి ఎన్నికల నిర్వహణ పైనే పూర్తిగా నిమగ్నమైంది. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా కొంత సమస్యలు ఎదురైనప్పటికీ గడువుని పెంచి అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చేశారు. ఈఎన్నికల్లో ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌ని సజావుగా నిర్వహించారు.



# సంక్షేమ బాదుడు

సంక్షేమం అన్నారు.. ప్రతీ ఇంటా ఏదో ఒక లబ్ధి పొందారన్నారు.. కానీ పథకాల ద్వారా ఒక్కో కుటుంబం పొందిన లబ్ధి కంటే వారిపై బాదుడు భారం పది రెట్లకు పైగా పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సామాన్యుడి ఇంట ధరల మంట అంటుకుంది. ధరల రూపంలో, ఛార్జీల రూపంలో ప్రతీ కుటుంబం ఐదేళ్లు విలవిలలాడిపోయింది. కరెంటు బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక చెత్త పన్నుతో పాటు ఇంటి పన్నులు పెరుగుదలతో అద్దెలు కూడా పెరిగాయి. ధరా భారం, చార్జీలు, పన్నుల మోతలతో కుటుంబాలు చితికిపోయాయి. ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని, కోల్పోయిన ఆదాయాన్ని చూసుకుని ఘొల్లుమంటున్నాడు. పెరిగిపోతోన్న ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విస్మరించింది. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలను ఇష్టం వచ్చినట్లుగా పెంచేశారు. అసలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయంటే సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. వ్యాపారుల తీరు ఈ విధంగా ఉంటే.. ప్రభుత్వం చార్జీలు, పన్నుల బాధుడుతో చెలరేగిపోయింది. మొత్తంమీద ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అరకొర విదిల్చి పెద్దమొత్తంలో దోచుకుందని ప్రజలు వాపోతున్నారు.

- సామాన్యుడిపై ధరా భారం
- పథకాల మాటున రెట్టింపు దోపిడి
- ధరలు అదుపులో వైసీపీ ప్రభుత్వం విఫలం
- ఐదేళ్లలో 200 నుంచి 300 శాతం పెరిగిన ధరలు
- ఐదేళ్లలో కుటుంబానికి 3 లక్షల వరకు అదనపు ఖర్చు
- మందుబాబులుంటే ఆ భారం మరో రూ.2 లక్షలు అదనం

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం.. సంక్షేమం.. అంటూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం జపం చేస్తూ వచ్చింది. అయితే సంక్షేమం రూపంలో అందిన మొత్తాలకంటే తమ నుంచి వివిధ రూపాల్లో దోచుకున్నదే అధికం అని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమం కంటే ఒక్కో కుటుంబంపై అంతకు రెండు రెట్లు భారం పడింది. ఈ విషయం గమనించిన ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో సంక్షేమంపై ఊకదంపుడు ఉపన్యాసాలతో హోరెత్తించింది. అయితే ధరలు, చార్జీలు, పన్నుల రూపంలో తమపై పడిన భారాన్ని తలుచుకుని ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలకు రెక్కలు వచ్చాయి. నాటి నుంచి ఇప్పటి వరకూ నిత్యావసర ధరల్లో పెరుగుదల 200 నుంచి 300 శాతం ఉంది. 2019లో రూ.40 ఉన్న కిలో సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.65 నుంచి 70కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో కందిపప్పు ధర ఇప్పుడు 160కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో పామాయిల్ రూ.155కి పెరిగి ఇప్పుడు రూ.98కి తగ్గింది. రూ.40 ఉన్న లీటరు పాల ధర ఇప్పుడు రూ.70కి చేరింది. కిలో చికెన్ రూ.150 నుంచి రూ.300కు, రూ.350 ఉండే మటన్ రూ.850కు పెరిగింది. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో పెట్రోలు ధర లీటరుకు రూ.10 అదనం కావడంతో భారం మరింత పెరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే నిత్యావసర ధరలు సామాన్యుడి నడ్డి విరిచేస్తున్నాయి.

### మందుబాబుల కుటుంబమైతే..

గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో క్వార్టరు మద్యం ధర రూ.50 నుంచి 60 ఉండేది. వైసీపీ ప్రభుత్వం మద్య నిషేధం పేరుతో మద్యం ధరను రూ.200కు పెంచింది. ఫలితంగా ఒక్కో మందుబాబుపై కనీసంగా రూ.140 భారం పడింది. ఆ కారణంగా ఆయా కుటుంబాలపై నెలకు రూ.4,200 భారం అదనంగా పడింది. ఏడాదికి రూ.50,400, ఐదేళ్లకు రూ.2లక్షల 52 వేలు అదనంగా భారం పడింది. అంటే ఒక్కో మందుబాబు కుటుంబంపై కనిపించకుండా రెండు న్నర లక్షల భారం పెరిగింది. దీనికి తోడు ఇంటి పన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ చార్జీలను కలుపుకుంటే ఆ భారం మరింత పెరిగినట్లే.

### ధరల స్థిరీకరణపై నిర్లక్ష్యం

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను స్థిరీకరిస్తామని, అందుకోసం రూ.3 వేల కోట్లతో నిధిని బడ్జెట్లో కేటాయిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. చెప్పినట్లుగా బడ్జెట్లో నిదులు కేటాయించినట్లు చూపించిన ప్రభుత్వం ఆచరణలో దాన్ని పక్కన పెట్టేసింది. ఫలితంగా ధరల భారం ప్రజలపై దారుణంగా పడింది. కందిపప్పు, బియ్యం ధరలు పెరిగినప్పుడు ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం సబ్సిడీ ధరలకు వాటిని ఇవ్వలేదు. దీంతో ఆ భారమంతా ప్రజలే మోయాల్సి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ధరలు పెరిగిన సందర్భాల్లో రైతుబజార్ల ద్వారా, రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ ధరలకు వాటిని అందించింది. ఫలితంగా సామాన్యులకు కొంత ఊరట లభించేంది. వైసీపీ వచ్చాక ఆ ఊసే లేకుండా పోయింది.

### రూ.1.96 లక్షలు ఇచ్చి రూ.3.60 దోపిడీ

ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వార ఒక్కో కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకూ ప్రయోజనం చేకూరినట్లు వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. 4 దఫాల అమ్మఒడి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.54 వేలు, 3 దఫాల చేయూత ద్వారా రూ.55 వేలు, రుణ మాఫీ ద్వారా రూ.40 నుంచి రూ.60 వేలు, పింఛన్ల పెంపుదల ద్వారా రూ.27 వేలు లబ్ధి చేకూరింది. అంటే ఒక కుటుంబంలో ప్రభుత్వ పథకాలన్నీ పొందినా అది రూ.1.96 లక్షలు అందుకున్నట్లు. కానీ ధర పెరుగుదల కారణంగా అదే కుటుంబంపై నెలకు రూ.4 నుంచి 6 వేలు చొప్పున ఏడాదికి 48 నుంచి 72 వేలు ఐదేళ్లకు 2 లక్షల 40 వేల నుంచి రూ.3 లక్షల 60 వేల వరకూ భారం పడినట్లు. అంటే సంక్షేమ పథకాల పేరుతో రూ.1.96 లక్షలు ఇచ్చి అదనంగా 2 లక్షల వరకు దోచుకున్నట్లే.

### నెలకు రూ.6 వేల భారం

వైసీపీ అధికారంలోకి వచ్చాక లెక్కలు తీస్తే ఒక్కో కుటుంబంపై రూ.4 నుంచి 6 వేల వరకు భారం పడుతున్నట్లు తేలింది. 25 కేజీల బియ్యం కట్టపైనే ఒక్కో కుటుంబం నెలకు రూ.650 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. గతంలో రూ.వెయ్యి ఉన్న బియ్యం కట్ట ఇప్పుడు రూ.1650 వరకూ విక్ర యిస్తున్నారు. కంది పప్పుపై ఒక్కో కుటుంబం నెలకు రూ.500, నూనెలపై రూ.400, పాలపై రూ.900 వందలు, గ్యాసుపై రూ.500, చింతపండు, ఉల్లిపాయలపై రూ.300, అల్లం, వెల్లుల్లిపై రెండు వందలు, చికెన్‌పై రూ.400, మటన్‌పై 800 నుంచి రూ.1200 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చంద్ర బాబు పాలనలో రూ.300 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.1100 నుంచి 1400 వస్తోంది. రోజుకు ఒక లీటరు పెట్రోల్ వాడే కుటుంబంపై నెలకు రూ.900 భారం పడింది. ఈ మొత్తం కలుపుకుంటే ఒక్కో కుటుం బంపై ప్రతి నెలా 4 నుంచి 6 వేల వరకూ ఖర్చు పెరిగింది.

- ఓటేయడానికి భారీ సంఖ్యలో రాక
- వైసీపీలో కలవరం.. రవాణాలో ఆటంకాలు



ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వాహనాల్లో ఆంధ్రాకు తరలివస్తున్న ప్రజలు

# ఉత్సాహంతో.. ఊర్లకు..

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు, మే 11: పండగలకు.. జాతర్లకు వచ్చినట్లుగా ఓటర్లు ఉత్సాహంగా ఊర్లకు తరలివస్తున్నారు. గతంలో ఎన్నో ఎన్నికలు జరిగాయి. కానీ ఆ.. చూద్దాంలే.. కుదిరితే వద్దాంలే.. ఎవరైనా ఖర్చులు పెట్టుకుంటే వస్తాం అన్నట్లుగా ఓటర్లు ఉండేవారు. కానీ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కసిగా ఓటర్లు పెద్దసంఖ్యలో సొంతూళ్లకు తరలివస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉంటున్న వేలాది మంది తమతమ సొంతూళ్లకు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరైతే శనివారమే పయనమవగా మిగిలిన వారు ఆదివారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో ఈ సారి ఓటు వేయడానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మొదలుకుని వివిధ రంగాలలో స్థిరపడిన వారు, కార్మికులు, విద్యార్థులు ఇలా అందరూ ఎలాగైనా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే కసితో సొంతూళ్ల బాట పట్టడం రాజకీయ పండితులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఓటు వేయడానికి ఆసక్తి చూపిన దాఖలాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. పైగా వరుస సెలవులు వస్తే ఆటవిడుపుగా భావించే వారని కానీ ఈ సారి పరిస్థితి మారిందంటున్నారు. కసితోనే వస్తున్నారన్న అంచనాలతో అధికారపార్టీ నేతల్లో కల వరం మొదలైంది. దీంతో రవాణా విషయంలో ఆటంకాలు కలిగించడానికి వైసీపీ కుట్రలు పన్నుతోందన్న విమర్శలను టీడీపీ చేస్తోంది. నిన్నమొన్నటి వరకు ఆయా పార్టీల అభ్యర్థులు ఏర్పాటు చేసే రవాణా సౌకర్యం మీద ఆశలు పెట్టుకున్న ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లు, ఇప్పుడు ఎవరికి వారు స్వచ్ఛందంగానే వచ్చేలా సిద్ధమయ్యారు. శనివారం గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల కోలాహలం నెలకొన్నది. అంతేగాక కొందరు గ్రూపులుగా ఏర్పడి సొంతంగా కార్లను కూడా ఏర్పాటు చేసుకొని మరీ ఓటు వేసేందుకు ఉత్సాహంగా చూపుతున్నారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద కార్లతో రద్దీ ఏర్పడింది.

### 50 వేల మందికిపైగా రాక..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ అంచనా ప్రకారం దాదాపు 50,000 మంది వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా స్వస్థలాలకు తరలి వస్తున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో చూస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లలో పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారు. తర్వాత స్థానాల్లో బాపట్ల, వేమూరు, రేపల్లె, అద్దంకి, చీరాల ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుంచి గుంటూరుకు వచ్చే రైళ్లని కిటకిటలాడుతూ వస్తున్నాయి. బస్సుల్లో సైతం అదే రద్దీ నెలకొంది. ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసినా అన్నింట్లోనూ సీట్లు దొరకని పరిస్థితి. 500 మంది వరకు విదేశాల నుంచి ఓటు వెయ్యడానికి రావొచ్చని తెలుస్తోంది. ఈ స్థాయిలో ప్రవాస ఓటర్లలో స్పందన కనిపించడంపై టీడీపీ ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలు తమకు సానుకూలమని, ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంటేనే ఈ విధంగా ఓటర్లు సొంతూళ్ల బాట పడతారని టీడీపీ అభ్యర్థులు లెక్కలు వేస్తుకుంటున్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు దాదాపు కూటమి వైపు మొగ్గారనే అంచనాల నుంచి తేరుకోకముందే ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు భారీగా తరలి రావడంతో వైసీపీ నేతలు కలవర పడుతున్నారు.

### ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్‌లో నివసిస్తూ ఓటు వేయడానికి గుంటూరు, పల్నాడు జిల్లాలకు వస్తున్న వారి కోసం రైల్వే శాఖ ఆదివారం ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసింది. నెంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖ రైలు ఆదివారం రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లికి 10.39, గుంటూరుకు 11.30, మరుసటి రోజు ఉదయం 6.30కి విశాఖ చేరుకొంటుంది. అలానే ఓటు వేసి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 13న రాత్రి 7.50కి నెంబరు. 07098 విశాఖ - సికింద్రాబాద్ రైలు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.25కి గుంటూరు, 3.20కి సత్తెనపల్లి, మంగళవారం ఉదయం 8.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఎవరైతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేకపోయారో వారు ఈ రైళ్ల సర్వీసులను వినియోగించుకోవచ్చని రైల్వే అధికారులు ప్రకటించారు.

# తెగిన నోట్ల కట్టలు.. తరలిన మద్యం

అధికార పార్టీ అభ్యర్థులకే మద్యం ఒక్క దుకాణంపైనా కన్ను వేయని ఎస్ఈబీ

ప్రచారం ముగిసింది. మద్యం దుకాణాలూ మూతపడ్డాయి. కానీ నోట్ల కట్టలకు, మద్యం సీసాల మూటలకు మాత్రం కట్టడి లేకుండా పోయింది. ఓట్ల కొనుగోళ్లకు నోట్ల కట్టలు తెగి ప్రలోభాల కోసం పందేరం అయిపోతున్నాయి. శనివారం నుంచి మద్యం దుకాణాలకు సీలు పడుతుందని ముందే తెలిసి అధికార పార్టీ నేతలు, అభ్యర్థులు మద్యం కోసం జాగ్రత్తలు పడ్డారు. దుకాణాల్లోని సరుకును తరలించేశారు. మరోపక్క ఓటుకోసం నోట్ల పంపిణీ కూడా కొన్నిచోట్ల గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటే, మరికొన్నిచోట్ల బహిరంగంగానే పంచేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎన్నికల పరిశీలకులు కానీ, ఎస్ఈబీ అధికారులు కానీ వీటివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.



ఓటు కోసం కట్టలు తెంచుకున్న డబ్బు చాలాచోట్ల శుక్రవారం నుంచే పంపిణీ మొదలుకాగా శనివారం మరింత ఊపందుకుంది. తెనాలి నియోజకవర్గంలో ఒక పార్టీ రూ.వెయ్యి ఇస్తుంటే, మరోపార్టీ రూ.1500 పంపిణీ చేస్తోంది. అధికార పార్టీ మాత్రం కొన్నిచోట్ల రూ.వెయ్యి, మరికొన్నిచోట్ల రూ.1500 వరకు పంచుతున్నారని సమాచారం. పొన్నూరులోనూ ఓటుకు రూ.2 వేల వరకు పంచేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు బహిరంగంగానే పంచుతున్నారు. మరికొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకే మాటగా ఎవరిపైనా ఎవరూ ఫిర్యాదు చేసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కి ముందే ఎక్కడికక్కడ డబ్బు సిద్ధం చేసి ఉంచటంతో చెక్‌పోస్టుల దగ్గర, దాడుల్లో డబ్బు దొరకలేదు. పల్నాడుకు చెందిన నేతలే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అధికార పార్టీ అభ్యర్థులకు డబ్బు సమకూర్చేపనిలో ఉన్నారని సమాచారం. ఇక మద్యం విషయానికి వస్తే ప్రతిపక్ష పార్టీల నేతలకు మద్యం అందడం కష్టంగా మారింది. అధికార పార్టీ నేతలకు మాత్రం ప్రభుత్వ దుకాణాల నుంచే సరఫరా జరిగింది. అమ్మకాల్లో పరిమితి ఉన్నా ఒక్కో మద్యం దుకాణం నుంచి చీప్‌లిక్కర్ బాటిల్స్ 100 చొప్పున మూటలు కట్టి తరలించుకుపోయారు. ఒక్కో దుకాణం నుంచి కనీసం పది మూటల చొప్పున బహిరంగంగానే తీసుకుపోయారు. దుకాణాల వద్ద మందుబాబులు క్యూలో ఉన్నా మద్యం లేదని చెప్పడంతో వారు గొడవకు దిగిన ఘటనలు పలు చోట్ల కనిపించాయి.

# పోలింగ్‌కు విస్తృతఏర్పాట్లు

- ఇతర జిల్లాల వారు వెళ్లిపోవాల్సిందే
- మీడియా సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమౌతుందని, సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు స్లిప్పులు, ఎన్నికల సంఘం పేర్కొన్న 16 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళ్లి స్వేచ్ఛగా ఓటు వేయొచ్చన్నారు. స్లిప్పు లేకపోయినా పోలింగ్ బూత్ నెంబరు, సీరియల్ నెంబరు తెలిస్తే గుర్తింపు కార్డుతో ఓటు వేయొచ్చన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద స్లిప్పులు అప్పటికప్పుడు ఇవ్వడానికి సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు వెంటనే వెళ్లిపోవాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లాలో 17 లక్షల 91 వేల 543 మంది ఓటర్లు 1919 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కుని వినియోగించుకోనున్నారన్నారు. ఎంపీ స్థానానికి 30, అసెంబ్లీలకు 132 అభ్యర్థులు పోటీలో ఉన్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 79 శాతం పోలింగ్ సెంటర్లలో వెబ్ కాస్టింగ్ చేస్తామన్నారు. 3 వేల కెమెరాలను పోలింగ్ కేంద్రాల లోపల, బయట అమర్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

**ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు..**

తాడికొండ నియోజకవర్గానికి గుంటూరులోని జేకేసీ కళాశాల, మంగళగిరికి ఆత్మకూరులోని నిర్మల హైస్కూల్, తెనాలికి జేఎంజే కళాశాల, ప్రత్తిపాడుకు గుంటూరులోని టీజేపీఎస్ కాలేజ్, గుంటూరు పశ్చిమకు ఆంధ్రా లూథరన్ కళాశాల, తూర్పుకు ఏసీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూం నెంబరు. 08632234301గా పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్, అన్నం సతీష్, బాధితుడి భార్య

- పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం.. ఎస్ఐ ఎదుట దాడి
- ఎస్ఐ, కోన వెంకట్‌పై కేసు నమోదు చేయాలని స్టేషన్ చుట్టుముట్టిన దళితులు
- దళితుడికి న్యాయం చేయాలని తెన్నేటి, వేగేశన, అన్నం డిమాండ్

# టీడీపీలో చేరాడని దళితుడిపై దాష్టీకం

కర్లపాలెం, మే 11: మండలంలోని గణపవరం పంచాయతీ లంకమాల పల్లికి చెందిన దళిత నేత కత్తి రాజేశ్వరరావు(రాజేష్) శనివారం ఉదయం బాపట్ల అసెంబ్లీ కూటమి అభ్యర్థి నరేంద్రవర్మ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. దీంతో బాపట్ల వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు అయిన సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ ఫోన్ ఆదేశాలతో ఇంట్లో నిద్రిస్తున్న రాజేష్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ వెంటనే స్టేషన్‌కు చేరుకున్న కోన వెంకట్ ఎస్ఐ జనార్ధన్ ఎదుటే దళితుడిపై చేయిచేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కుటుంబసభ్యులు, బంధువులు, టీడీపీ నేతలు స్టేషన్‌ను చుట్టిముట్టి ఐదు గంటల సేపు ఆందోళన చేశారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సలగల రాజశేఖర్, డాక్టర్ చార్వాక, న్యాయవాదులు కళ్ళం హరినాథరెడ్డి, గవిని శ్రీనివాసరావు, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, బెజ్జం వెంకటేశ్వర్లు స్టేషన్ వద్దకు చేరుకుని దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఫిర్యాదు లేకుండా కోన వెంకట్ చెప్పారని దళితుడ్ని ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించడంపై డీఎస్పీ మురళీకృష్ణ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు.



న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బాధితుడి బంధువులు

### కులం పేరుతో దూషించి దాడి

కోన వెంకట్, అతడి అనుచరులు మార్పు బెనర్జి, మార్పు రత్నం, కాగిత మోషె, నక్కా సంతోష్‌లు ఎస్ఐ సమక్షంలోనే కులం పేరుతో దూషించి, కాలుతో తన్నారని రాజేష్ డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పార్టీ మారటం నీ ఇష్టమా, ఎంతకు అమ్ముడు పోయావు.. నిన్ను చంపితే దిక్కు ఎవరు, మా బాబాయి కాబోయే ఎమ్మెల్యే అంటూ ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. ఎస్ఐ కూడా చెంపలపై కొట్టి, పెద్దవారితో నీకేందుకురా అని తిట్టాడన్నారు.

### ఎస్ఐపై వేటు

రాజేశ్‌పై దాడి చేసిన కోన వెంకట్‌తో పాటు ఆయన అనుచరులు, ఎస్ఐ జనార్ధన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# రైతు నిలవాలంటే టీడీపీ గెలవాలి..

- నీటిని తెచ్చి పలనాడును సస్యశ్యామలం చేస్తా
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తాం
- పల్నాడు ప్రాంతంపై ప్రేమతోటే ఇక్కడి నుంచి పోటీ..
- ప్రచార ర్యాలీలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు
- భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు

సత్తెనపల్లి మే 11: సత్తెనపల్లినుండి నరసరావుపేట వరకు ఉమ్మడి కూటమి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రచార ముగింపు ర్యాలీ శనివారం ఘనంగా జరిగింది. సత్తెన పల్లి చెక్ పోస్టు వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. భారీ ఎత్తున ట్రాక్టర్లతో నరసరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని తెచ్చుకుంటేనే పలన్నాడు ప్రజల జీవన గమనం మారేది అన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసు కో వాలన్నారు. సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసుకోవాలన్నారు. జల్ జీవన మిషన్ ద్వారా ఇంటింటికీ కులాయి కలెక్షన్ అందిస్తామన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తామన్నారు. ప్రజల భూసమస్యలను పరిష్కరిం చేందుకు కట్టుబడి ఉంటామన్నారు. పల్నాడు ప్రజలంతా తమవైపే ఉన్నారని దీమా వ్యక్తం చేశారు. పలనాడు ప్రాంతంపై మక్కువ తోనే అభివృద్ధి చేయాలన్న ఇష్టంతోనే నరసరావు పేట నుండి పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికారం లోకి రావాలని చంద్రబాబునాయుడు సీఎం కావాలన్నారు. మే13న జరిగే ఎన్నికలలో సైకల్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాల న్నారు. సత్తెనపల్లినుండి నరసరావుపేటవరకు పండుగ లాగా ర్యాలీసాగింది. రహదారులన్నీ జన సంద్ర మయ్యాయి. పార్టీ శ్రేణులు, ప్రజలు ప్రచారంలో అడుగడుగునా నీరాజనాలు పలికారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను గెలిపిస్తే నరసరావుపేట పార్ల మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. శ్రీకృష్ణ దేవరాయల గెలుపు నరసరావు పేట పార్లమెంట్ అభివృద్ధికి మలుపు, టీడీపీ వర్ధిల్లాలి.. అంటూ కూటమి శ్రేణులు, ప్రజలు నినాదాలు చేశారు.

**లావు మేఘన ప్రచారం ..** నరసరావుపేట పార్లమెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి మేఘన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి లావు శ్రీ కృష్ణ దేవరాయలను, సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని పిలుపు నిచ్చారు.



ట్రాక్టర్ పై ర్యాలీగా వెళ్తున్న లావు శ్రీ కృష్ణ దేవరాయలు



భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు, కూటమి శ్రేణులు

## శ్రీకృష్ణ.. అరవింద ప్రదర్శన

నరసరావుపేట, మే11: ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా టీడీపీ కూటమి అధ్వర్యంలో పట్టణంలో శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రజలకు అభివాదం తెలుపుతూ ర్యాలీలో ముందుకు కదిలారు. మూలకలూరు, ఇస్సపాలెం, సత్తెనపల్లిరోడ్డు, మల్లమ్మ సెంటర్, పల్నాడు బస్టాండ్ మీదుగా పాల చెక్‌పోస్టు సెంటర్ వరకు సాగింది. మహిళలు, యువకులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలీండర్లు అందించడం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగనే నెలకు రూ.4వేలు ఫించన్ పంపిణీ, రైతులకు పెట్టుబడి సాయం, మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలన్నా, అభివృద్ధి విస్తృతంగా అమలు జరగాలన్నా చంద్రబాబును మళ్లీ సీఎంను చేయాలని విజ్ఞప్తిచేశారు. తనను ఆదరిస్తే అండగా ఉంటానని తెలిపారు. తనకు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుకు సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అరవింద బాబు విజ్ఞప్తి చేశారు.



అభివాదం చేస్తున్న డాక్టర్ అరవింద బాబు, లావు శ్రీకృష్ణదేవరాయలు

లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడుకి తాగు, సాగు నీరు తీసుకువస్తేనే ఇక్కడి ప్రజల జీవనగమనం మారుతుందని, ఇందుకు మనం వరికెపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలని, సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసి, జల్‌జీవన్ మిషను పూర్తిచేయాలని, ఇవన్నీ నిబద్ధతగా జరగాలంటే టీడీపీఈ అధికారంలోకి వచ్చి. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల న్నారు. 13వ తేదీ జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, అరవిందబాబుని గెలిపించాలని కోరారు. ప్రదర్శనలో నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

## కూటమికి 130 -140 సీట్లు ఖాయం

- ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలి..
- వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం మూడు దశాబ్దాల వెనక్కి
- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని



మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమికి 130- 140 ఎమ్మెల్యే సీట్లు, 20- 22 ఎంపీ సీట్లు, తనకు 2 నుంచి 3 లక్షల మెజార్టీ వస్తుందని పెమ్మసాని ఆశాభావం వ్యక్తం చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని పెమ్మసాని కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తోందని, ముఖ్యంగా మహిళల్లో ఆదరణ మరింత ఎక్కువగా ఉందని తెలిపారు. సమాజానికి ఏదైనా మంచి చేయాలని వచ్చే తనలాంటి వాళ్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నట్లు ప్రచారంలో తనకు తెలిసిందన్నారు. నాలుగు నెలలు ప్రజల మధ్య తిరిగానని, పట్టణాలు, గ్రామాలు, వార్డుల్లో 300 పైగా బహిరంగ సభల్ని ఏర్పాటు చేసి ప్రజలకు చేరువయ్యానన్నారు. వైసీపీ తరుపున గుంటూరు పార్లమెంటుకు పోటీచేస్తున్న కిలారు రోశయ్య మూడు రాజధానులకు మద్దతు ఇస్తున్నారని, తాను అమరావతికి మద్దతుగా వున్నానని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జగన్‌రెడ్డి తాను సంపాదించిన అవినీతి సొమ్ముతో ఎన్నో రకాల ప్రలోభాలకు తెరతీయబోతున్నారని, ఆ అవినీతి సొమ్ముతో ప్రజల ఓటును గెలవలేరని, అరాచకత్వం, అణచివేతతో ప్రజల మనసులు గెలవలేరని, అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లలేరని, కులాల మధ్య విద్వేషాలతో ప్రజలను చీల్చలేరని ప్రజలు తమ ఓటుతో రుజువు చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు ఒక్క రోజు ఓటేస్తే ఐదేళ్ల ప్రజల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. నీళ్లు, నిరుద్యోగం, రహదారులు, మౌలిక సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను తాను గుర్తించానని, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అలాగే గంజాయి నిర్మూలన తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2019కి ముందు గుంటూరు ఛానల్ అభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం 250కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేసిందని, కానీ అధికారంలోకి వచ్చాక జగన్ ఆ జీవో నిధుల్ని దారి మళ్లించారని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ప్రమాదకరమైనదని, దాన్ని రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



## విద్యుదాఘాతంతో రైతు మృతి

- వ్యవసాయమోటారుకు ఫీజు వేస్తుండగా షాక్ ..

శ్రీనగర్(ఈపూరు), మే11: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనగర్‌లో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల పరమేశ్వరరెడ్డి (26) వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు వేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. పరమేశ్వరరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

# గుంటూరు తూర్పులో కూటమి గెలుపు ఖాయం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నసీర్
- ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భారీ రోడ్ షో

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి విజయకేతనం ఎగరవేయడం ఖాయమని మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు పార్లమెంటు, గుంటూరు తూర్పు అసెంబ్లీ కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నసీర్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, డిప్యూటీ మేయర్ షాజీలా, భరత్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భారీ రోడ్ షో నిర్వహించారు. గుంటూరు తూర్పునియోజకవర్గ ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ కూటమికి రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రభంజనం వీస్తోందన్నారు. 130 నుంచి 140 సీట్లు వస్తాయని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. 2019లో పాలిచ్చే ఆవును కాదని తన్నే దున్నపోతును ఎన్నుకోవడంతో ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడిందన్నారు. పారిశ్రమలు, పెట్టుబడి, అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు లేకుండా పోవడమే కాకుండా, అప్పులు మాత్రం లక్షల కోట్లు ప్రజల నెత్తిన పడ్డాయన్నారు. రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకు చంద్రబాబుని సీఎం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా తన కూతురికి ఓట్లు పడే పరిస్థితి లేదని తెలిసి మైనార్టీ ఓట్లను దండుకునేందుకు విష ప్రచారాలు చేస్తున్నాడన్నారు. నాలుగు శాతం మైనారిటీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మైనార్టీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలందరూ వాస్తవాలను అర్థం చేసుకొని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ప్రచారంలో భాగంగా స్థానికులతో పెమ్మసాని, నసీర్



గుంటూరు తూర్పులో రోడ్‌షో నిర్వహిస్తున్న పెమ్మసాని, నసీర్, డేగల తదితరులు

### పోలీసుల అదుపులో
## నకిలీ జీఎస్టీ అధికారి

మంగళగిరి, మే11: జీఎస్టీ అధికారినంటూ పరిశ్రమల యజమాను లను బెదిరించి డబ్బు లు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలిలా వున్నాయి..

విజయవాడకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి రెండు రోజులక్రితం ఎర్రబాలెంలో ఎస్ఆర్ ఇండస్ట్రీస్ నిర్వాహకుడు రామరాజును కలిసి తాను సీజీఎస్టీ అధికా రినని పరిచయం చేసుకున్నాడు. కంపెనీ వివరాలు అడిగి తెలుసుకుని, కొన్ని లోపాలు వున్నాయని, రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పరిశ్రమలో పన్ను చెల్లింపులు, రికార్డులన్నీ సక్ర మంగానే వున్నాయని, అంత మొత్తం ఇవ్వలేనని, ఏమైనా వుంటే తమ ఆడిటర్‌తో మాట్లాడుకోవాలని యజమాని సూ చించారు. ఆపై ఆడిటర్ సహకారంతో సీజీఎస్టీ ఉన్నతాధి కారులను ఆశ్రయించాడు. అతనెవరో తమకు తెలియ దని, పోలీసులకు సమాచారం అందించి కేసు పెట్టాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో నకిలీ అధికారి శనివారం మధ్యాహ్నం డబ్బుకోసం ఎర్రబాలెం రాగా పరిశ్రమల యజమానులు నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. సదరు నకిలీ అధికారి పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులే లక్ష్యంగా విజయవాడ, మంగళగిరి, కానూరు ప్రాంతాల్లో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు.



నకిలీ అధికారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

## ఆలయ స్థలం కబ్జా.. విక్రయం

నరసరావుపేట, మే11: కోటప్పకొండ దిగువ ఉన్న ఆలయాల స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేశారు. ఇంతటితో ఆగక ఆ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... కోటప్పకొండ దిగువన జంక్షన్‌లోని శ్రీ భువనేశ్వరీ అమ్మవారు, శ్రీ నీలకంఠేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నకోటేశ్వర స్వామివార్ల దేవాలయాల ప్రహరీ గోడలను ఆర్అండ్‌బీ శాఖ రహదారి వెడల్పు చేసే సాకుతో పడగొట్టారు. దీనిపై దేవాలయాల ధర్మకర్తలు హైకోర్టును ఆశ్రయించారు. (కంటెంప్ట్ కేసు నంబరు 773/2021) దేవాల యపు ప్రహరీ పడగొట్టిన చోటనే మళ్లీ కట్టమని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కానీ ఒక ప్రణాళిక ప్రకారం ఆర్అండ్‌బీ స్థానిక పెద్దలతో కుమ్మక్కై పడగొట్టిన స్థానంలో ప్రహరీ కట్టకుండా సుమారు 15అడుగులు వెనుక్కు నిర్మించారు. ఇలా కోర్టు ఆదేశాలకు వ్యతిరే కంగా కట్టటం కోర్టు ధిక్కారణ చర్యగా పరిగణించబడుతుందని ధర్మకర్తల తరపున వనమా ప్రభుకుమారి తెలిపారు. అంతేకాక ఇదివరకటి పాత గోడకు ఆర్అండ్‌బీ శాఖ కొత్తగా వెనుక్కు నిర్మించిన కొత్తగోడకు మధ్యన మిగిలిన స్థలాన్ని ముక్కు వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఈ నెల 2న 27494, 27495, 27496 నెంబర్ల ద్వారా విక్రయించి క్రయ ధనం పొందారని తెలిపారు. దీనిని ఆక్రమణలు, ల్యాండ్ గ్రాబింగ్ కింద పరిగణించాల్సి ఉంటుందని, చట్ట ప్రకారం ఈ విక్రయాలు చెల్లుబాటు కావని తెలిపారు.

### మంగళగిరి నియోజకవర్గంలో
## రాజకీయాలకు అతీతంగా లోకేశ్ సేవ

- అన్ని వర్గాల ప్రజలూ లోకేశ్ వెంటే..
- అమరావతి మహిళలపై జగన్ సర్కారు దమనకాండ
- ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు
- ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



పంచుమర్తి అనురాధ

మంగళగిరి సిటీ, మే11: మంగళగిరిని సొంత కుటుంబంలా భావించి గడిచిన నాలుగున్నరేళ్లలో రాజకీయాలకు అతీతంగా నారా లోకేశ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మం గళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడా రు. మంగళగిరిలో అన్నివర్గాల ప్రజలూ లోకేశ్ వెంటే ఉన్నారని, ఆయన 80 వేలకు పైగా మెజార్టీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు. వధూవరులకు పెళ్లికానుక, అన్న క్యాంటిన్లు, తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు, నూలు వడికే రాట్నాలు, సంజీవని ఆరోగ్య కేంద్రాలు, యువతకు సాంకేతిక విద్యలో ఉచిత శిక్షణ, ఉత్తమ ప్రమాణాలతో క్రీడా పోటీలు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇస్త్రీ బం డ్లు, పండుగ కానుకలు, సెలూన్ కుర్చీలు, స్వర్ణకారులు, శ్రామికులకు వృత్తిపరమైన పరికరాలు అందించి లోకేశ్ మంగళగిరి ప్రజల మనస్సు గెలిచారని చెప్పారు. మంగళగిరిలో లోకేశ్ గెలిస్తే ఈ నియోజకవర్గం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరిగాయన్నారు. వైసీపీ నేత ధర్మవరం వస్త్ర వ్యాపారులను నగ్నంగా కూర్చోపెట్టి హింసిస్తే లోకేశ్ ఆదేశాలతో తామంతా ధర్మవరం వెళ్లి బాధిత వస్త్ర వ్యాపారులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి కుటుంబం బాధితులను కనీసం పరామర్శించలేదని విమర్శించారు. జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పూర్తిగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్టని ఆరోపించారు. ఈ చట్టం వల్ల కడప జిల్లా ఒంటి మిట్ట లో ఓ చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి చెందిన యువతికి టీడీపీ అన్ని విధాలా భరోసా కల్పించిందన్నారు. వైసీపీలోని చేనేత నాయకులు ఈ విషయమై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. అమరావతి కోసం ఉద్యమిస్తున్న మహి ళలపై జగన్ ప్రభుత్వం దమనకాండ సాగించిందన్నారు. మహిళలపై హింసకు పాల్పడిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను తీసుకువచ్చారని తెలిపారు. షెడ్డులో నేత నేసే చేనేత కార్మికులకు కూడా నేతన్న నేస్తం, చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఆప్కోను బలోపే తం చేయడంతోపాటు వీవర్ శాలను విస్తరించడం, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా కూటమికి అండగా నిలిచి మంగళగిరిలో నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అనురాధ పిలుపునిచ్చారు.

## రాజధాని అమరావతి లక్షల కోట్ల రాష్ట్ర సంపద

- 1607వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, మే 11: అభివృద్ధి సంక్షేమం చేసే నాయకుడికి ఓట్లు వేయాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు శనివారం నాటికి 1607 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. అమరావతి లక్షల కోట్ల రాష్ట్ర సంపదన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటే రాష్ట్ర భవిష్యత్ బంగారు బాట వేసినట్టు అవుతుందన్నారు. లేదంటే మరింత నాశనం చేసుకున్నట్లేనని అన్నారు. ఓటు అనే ఆయుధంతో అరాచక వైసీపీ ప్రభుత్వాని భూస్థాపితం చే సి రాష్ట్ర రాజధాని అమరావతిని కాపాడుకోవాలని విన్నవించారు. అసమర్థ పరిపాలనతో రాష్ట్ర ఇరవై సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. ప్రజలు విజనరి ఉన్న నాయకుడికి ఓటు వేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 155, 164,175 |
| చికెన్ విత్ స్కిన్ | 300.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 310.00 |







కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు సుభాని తదితరులు

## మాధవిపై దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ముస్లిం సేన నాయకుల ఫిర్యాదు

గుంటూరు, మే 11 : ముస్లిం కుటుంబంపై దాడి చేశారంటూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి గల్లా మాధవిపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని, సంఘం నాయకులు శనివారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రచారంలో ఓ ముస్లిం యువకుడు హమీద్ బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తానంటోంది అని ఓటు వేయమని చెప్పి ఇంటి గేటు వేస్తే ఆగ్రహానికి గురైన నాయకులు ఇంట్లోకి వెళ్లి హమీద్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను చితకబాదారని ఒక అవాస్తవాన్ని ప్రచారం చేస్తూ ముస్లిం ఓట్లు తమ పార్టీకి పడేలా పశ్చిమ నియోజకవర్గంలోని వైసీపీ అభ్యర్థి విడదల రజనీతో పాటు, రాష్ట్రంలో ఉన్న వైసీపీ నాయకులు తమ సోషల్ మీడియా అకౌంట్‌లలో పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మైనార్టీ నాయకుడు గులాం రసూల్ అనే అభిమాని పేరిట ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్టు పెట్టి గల్లా మాధవి పరువు ప్రతిష్టలకు భంగం కలిగేలా, అంతేగాక నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి, వైసీపీ వర్గాలకు గొడవలు జరిగేలా కుట్రలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నూర్ భాషా సంఘం నగర అధ్యక్షుడు షేక్ ఆదం షఫీ, సయ్యద్ అలీషా, షేక్ బాజీ, ఖాదర్ వలీ, షేక్ ఇమామ్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలి

● లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఛైర్మన్ ప్రొఫెసర్ మాల కొండయ్య

గుంటూరు(తూర్పు), మే 11 : రాష్ట్ర వ్యాప్తంగా రేపు జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఛైర్మన్ ప్రొఫెసర్ కే.మాల కొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ నెల రోజులుగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు ప్రాధాన్యతపై పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. ఓటు వేయని వారికి ప్రశ్నించే హక్కును కోల్పోతారని, అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఓటు వేయండి...ఓటు వేయించండి అనే బాధ్యతను యువత తీసుకోవాలన్నారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ నూరు శాతం ఓటింగ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్, సీతా రమేష్, వల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ సభ్యులు

## ఓటుతో సమర్థవంతమైన నేతను గెలిపించుకోవాలి

గుంటూరు, మే 11 : ఓటు వేసే ముందు అన్నీ ఆలోచించి, సమర్థవంతమైన నేతలను గెలిపించుకోవాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఓటర్ చైతన్య కరపత్రాలను శనివారం విడుదల చేశారు. అరండల్‌పేటలోని ఆ సంస్థ కార్యాలయంలో ఓటర్ల చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల పెద్దలు, మేధావులు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞులు, మంచివారు దూరంగా ఉండి ఎన్నికల గురించి, పాలన గురించి పట్టించుకోకపోతే అందుకు వారికి పడే శిక్ష దుర్మార్గుల దుష్టపాలనను ఐదు సంవత్సరాల పాటు అనుభవిస్తూ నిరంతరం వేదనపడటమేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మంచి వాడిని మన ఓటుతో గెలిపిస్తే సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి కూడా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదా శివం, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, అవగాహన సంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ళా అశోక్, సంగీత విద్వాంసులు మల్లేశ్వరరావు తదితరులున్నారు.




మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీకాంతం తదితరులు

## మహిళ ఉదరం నుంచి 14 కిలోల భారీ కణితి తొలగింపు

● అరుదైన శస్త్రచికిత్స చేసిన శ్రేష్ఠ హాస్పటల్ వైద్యులు

గుంటూరు (మెడికల్) మే 11 : కడుపు నొప్పి, శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన 55 సంవత్సరాల మహిళ ఉదరం నుంచి 14 కిలోల భారీ కణితి తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు శ్రేష్ఠ హాస్పటల్‌కు చెందిన వైద్య బృందం వెల్లడించారు. శనివారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ఠ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ శస్త్రచికిత్స వివరాలను తెలిపారు. గుంటూరుకు చెందిన 55 సంవత్సరాల మహిళ తీవ్ర అనారోగ్యంతో ఇటీవల శ్రేష్ఠ హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షల్లో ఆమె కడుపులో 14 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. పేగులకు అతుక్కుని ఆపరేషన్ చేసేందుకు కష్టంగా ఉన్న కణితి నుంచి తొలుత పది లీటర్ల ద్రవాన్ని బయటకు తీశారు. అనంతరం గతనెలలో అరుదైన శస్త్రచికిత్స చేసి కణితిని పూర్తిగా తొలగించారు. బయాప్సీ చేయగా క్యాన్సర్‌లేదని నిర్థారణ జరిగింది. ఆరోగ్యం కుదుటపడడంతో మహిళను డిశ్చార్జి చేశారు. శరీరంలో ఎలాంటి ట్యూమర్లు ఉన్నా అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలని వైద్య బృందం సూచించింది. సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ లక్ష్మీకాంతం, డాక్టర్ కీర్తి, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మొయిన్, డాక్టర్ విద్యాసాగర్, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితి, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.



# ఆశీర్వదించండి.. పశ్చిమ ప్రజల రుణం తీర్చుకుంటా

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి



గల్లా మాధవికి ఆడబిడ్డ లాంఛనంగా చీరె పెడుతున్న పశ్చిమ ప్రజలు

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మే 13న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను ఆశీర్వదిస్తే, అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి కోరారు. గుంటూరు 36వ డివిజన్ బంజారా కాలనీలో శనివారం ఆమె ఎస్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమలో ఈసారి జరగబోతున్న ఎన్నికలు అత్యంత కీలకమని, కుళ్ళు, కుతంత్రాలతో ప్రజల రక్తాన్ని డబ్బుల రూపంలో పీల్చే జలగ మాదిరి వైసీపీ అభ్యర్థి పోటీలో ఉన్నదని హెచ్చరించారు. మాయమాటలతో, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని ప్రజలను మభ్యపెట్టి గెలవాలని చూసే వైసీపీ అభ్యర్థి రజినికి ఓటు వేస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో చిలకలూరిపేట ప్రజలను చూసిన ప్రపంచానికి తెలుసన్నారు. ప్రజలనే నమ్ముకొని తాను ముందుకు వచ్చానని, వైసీపీ నేతలు పెట్టే ప్రలోభాలకు లొంగకుండా, అభివృద్ధి, సంక్షేమం, రక్షణ కోసం సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించాలని కోరారు. నియోజకవర్గం ప్రతి వీధిలో సీసీ రోడ్డు, స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి పేదవానికి సొంత ఇంటి కలను సాకారం చేసే విధంగా తాను పని చేసి తీరుతానని గల్లా మాధవి హామీనిచ్చారు.

### హలో ఏపీ... బై బై వైసీపీ

హలో ఏపీ.. బై బై వైసీపీ అనే నినాదాన్నే ప్రజలందరూ ఏకపక్షంగా గెలిపిస్తారని గళ్ళా మాధవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి సుపరిపాలనకు శ్రీకారం చుట్టాలని కోరారు. అవినీతి పాలనను ఓటు అనే ఆయుధంతో అంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా, పిల్లల భవిష్యత్తును, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విజన్ ఉన్న చంద్రబాబుకు ప్రజలు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి రహిత పాలనతో రాష్ట్ర ప్రగతిని పరుగులు తీయించే శక్తి ఎన్డీఏ కూటమికే ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికి మోసపోయింది చాలని.. ఇకనైనా మంచి పాలన కోసం సముచిత నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఇక కొన్ని గంటలు మాత్రమే సమయం ఉంది... మనం బాగుందాం.. రాష్ట్రాన్ని బాగుచేద్దాం! అంటూ పిలుపునిచ్చారు. పేదరికం లేని నవ సమాజాన్ని నిర్మించేందుకు గుంటూరు పార్లమెంటు బరిలో నిలిచిన పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ బరిలో నిలిచిన తనను గెలిపించాలని విన్నవించుకున్నారు.



ఎన్నికల ప్రచారంలో గల్లా మాధవి, పార్టీ శ్రేణులు

### గల్లా మాధవిపై ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు

గుంటూరు పశ్చిమ కూటమి అభ్యర్థి గల్లా మాధవిపై సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బీవీ రామాంజనేయులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసారు. గుంటూరులో ప్రచారం చేస్తున్న గల్లా మాధవి అనుచరులు మైనారిటీ యువకుడు హమీద్‌పై తీవ్రంగా దాడి చేశారని, గుంటూరులో ముస్లింలపై బీజేపీ-టీడీపీ నేతల దాడులు మొదలు అంటూ సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేసి కులాలు, మతాలు, పార్టీ మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# లోకేశ్‌తోనే చేనేతకు పూర్వవైభవం సాధ్యం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

మంగళగిరి, మే 11: మంగళగిరి చేనేతకు పూర్వవైభవం తీసుకురావడం నారా లోకేశ్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నా రు. జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి కాల నీ, సుందరయ్య నగర్, శ్రామికనగర్, సూర్యనారాయణ నగర్, అంజనేయ కాలనీ, వీవర్స్ కాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహిం చారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనలో చేనేత చిన్నాభిన్నమైందన్నారు. ప్రాభవం కోల్పోతున్న చేనేతకు ప్రాణం పోయాల ని లోకేశ్ సంకల్పించారని, ఆ సంకల్పానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరిచి ఆదాయ వనరులను పెంచేందుకు లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తు తరాల గురించి ఆలోచించి చేనేత పరిశ్రమ మనుగడకు జీవం పోస్తున్న నారా లోకేశ్‌ను మంగళగిరి ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ అధ్యక్షుడు కారంపూడి అంకమ్మరావు, నేతలు అలుగూరి రాజశేఖర్, కాశిన కొండలు, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, ఆకురాతి నాగేంద్రం, చిలకా బసవమ్మ, ఒడిశా నరేష్, నందం బాబూరావు, వంగర లక్ష్మయ్య, అనుమల శ్రీను, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు, అలుగూరి వీరాంజనేయులు, తిరుమలశెట్టి హనుమంతరావు, గద్దె శ్రీమన్నారాయణ, తిరువీధుల అరుణ్‌బాబు, తుమ్మా సర్వేశ్వరరావు, శలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ

# నిధుల్లేక కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు



సమావేశంలో పాల్గొన్న జాస్తి వీరాంజనేయులు

● పంచాయతీరాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు

దుగ్గిరాల, మే 11: కేంద్ర ప్రభుత్వం పంపిన వేల కోట్ల రూపాయల ను రాష్ట్రం విడుదల చేయకపోవడంతో పంచాయతీలు నిధుల్లేక కొట్టు మిట్టాడుతున్నాయని పంచాయతీరాజ్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాం జనేయులు అన్నారు. మండలంలోని కేఆర్‌కొండూరులోని కనకపుట్టలమ్మ తల్లి ఆలయంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు పెమ్మ సాని చంద్రశేఖర్, నారా లోకేశ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వ హించారు. అనంతరం వీరాంజనేయులు మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ బకాయిల పేరుతో రాష్ట్రప్రభుత్వం విద్యుత్‌శాఖకు చెల్లిస్తుంద న్నారు. 42రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.998.82 కోట్లు నేటికి గ్రామపంచాయతీల ఖాతాల్లో జమచేయలేదన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిందన్నారు. సీఈవో ఆదేశాలిచ్చినప్పటికీ, ఫలితం లేకపోయందని, తాగునీటి సమస్య, గ్రీన్ అంబాసిడర్‌లు, కార్మికుల వేతనాలు తదితర సమస్యలతో గ్రామ పంచాయతీలు సత మతమ వుతున్నాయన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ మూడు ముక్క లాటతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖరరావు, నియో జకవర్గ అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్‌లకు అఖండ విజయం చేకూర్చా లన్నారు. వెలివెల శ్రీనివాసరావు, పిరాట్ల పిచ్చిబాబు, ఆళ్ల సాంబశివ రావు, జాస్తి అమరశేషేంద్ర, జనసేన నాయకుడు కమ్మెల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ విజయం ఖాయం

● వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

దుగ్గిరాల, మే 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం తథ్యమని టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రా వు అన్నారు. దుగ్గిరాలలో టీడీపీ నాయకులు మహిళలు, ర్యాలీ శనివారం నిర్వ హించారు. ఆలీనగర్ జెండాచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్, రైలు పేట, చెన్నకేశనగర్, అంబేద్కర్‌నగర్, రామ్‌నగర్‌ల మీదుగా ముర్తుజానగర్ జెండాచెట్టు, యాదవపాలెంలో మీదుగా లైబ్రరీ వరకూ కొనసాగింది. ర్యాలీ అనంతరం వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం లో నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. రానున్న కొద్ది గంటల్లో ప్రజలంతా అన్ని రకాలుగా ఆలోచించి మనకు అన్నివిధాలా మేలు చేసే వ్యక్తులైన చంద్రశేఖర రావు, లోకేశ్‌లకు అఖండ విజయం చేకూర్చాలన్నారు. తమకు అన్నివిధాలుగా సహకరించిన జనసేన, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఎన్డీఏ కూటమి విజయం రాష్ట్రంలో లాంఛనమని అన్నారు. వల్లూరు నరసింహా రావు, ఎన్నారై జంపాల సుబ్బారావు, నిమ్మగడ్డ వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, రవియాదవ్, గద్దె వాసు, దేవరపల్లి చంటి, కాకా బాబు, నాయుడు బాబూరావు, ఉన్నం బాబూరావు, లంకా ఫణి సోదరులు, కీర్తి పవన్, లియాఖత్, ఖురేషి, సాదిక్, కరీముల్లా, జంపాల రాజేశ్వరి, కవిత, గద్దె శివ కుమారి, గూడూరు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



నమూనా బ్యాలెట్‌తో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

## లోకేశ్‌ను గెలిపించాలని విస్తృత ప్రచారం

మంగళగిరి, మే 11: జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు పట్టణంలోని 14వ వార్డులో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించాయి. టీడీపీ నేత జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నమూనా బ్యాలెట్‌తో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వింజమూరి చంద్రశేఖర్, కొల్లి వేణు, కొల్లి నరసింహారావు, సోమల సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండండి : సీఐ

వట్టిచెరుకూరు, మే 11: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు గ్రామాల్లో మైకుల జోరు శనివారం సాయంత్రంతో మూగబోయాయి. మండల వ్యాప్త గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా వట్టిచెరుకూరు మండల సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు తమ సిబ్బందితో విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామస్థులు ఆయా పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించడమే కాకుండా ఘర్షణలు, అలజడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో శనివారం సీఆర్‌పీ బలగాలతో రూట్ మార్చ్ నిర్వహించారు.

## ఎస్టీ, ఎస్సీ, బీసీలు జగన్‌కు ఓటెయ్యొద్దు

తాడేపల్లి టౌన్, మే 11: వైసీపీ ప్రభుత్వం 72వేల కోట్ల ఎస్సీ నిధులు దారి మళ్లించిందని, ఎస్సీ వ్యక్తిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీవారికి దక్కిందని ఎస్సీ, ఎస్టీ, బీసీలు జగన్‌కు ఓటెయ్యొద్దని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు అన్నారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపోటములను శాసించేది ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని ఆలోచించి ఓటెయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం రామారావు, సి రాజారావు పాల్గొన్నారు.



## అభివృద్ధికై టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

● బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ శర్మ



మీడియాతో మాట్లాడుతున్న శ్రీధర్ శర్మ

గుంటూరు, మే 11 : దేశ భవిష్యత్‌ను నిర్ధారించే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని జిల్లా అభివృద్ధికై టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈమేరకు బ్రాడీపేటలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ అభ్యర్థిగా గల్లా మాధవిలను, గుంటూరు పార్లమెంటు పరిధిలోని శాసనసభ అభ్యర్థులందరికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి ధర్మాన్ని గెలిపించాలని కోరారు. ఈ జగనాసుర పాలనను ఓటు అనే ఆయుధం ద్వారా అంతమొందించాల్సిందిగా శ్రీధర్ కోరారు. గుంటూరు నగరంలో ఉన్న ఈ ముగ్గురు అభ్యర్థులు స్థానికులని, వైసీపీ అభ్యర్థిని విడదల రజని స్థానికేతరాలు అని, ఆమె ఈ నగరానికి సంబంధం లేని వ్యక్తి అని తెలియజేశారు. స్థానికులతోనే నగర అభివృద్ధి సాధ్యపడుతుందని, అలానే ఓటింగ్ రోజున అపార్టుమెంట్ వాసులు, ధనవంతుల కుటుంబాలు, వ్యాపారవర్గాల వారు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పడబోతున్న ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఓటరూ భాగస్వామి కావాలని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ పిలుపునిచ్చారు.

## నసీర్‌కు బ్రాహ్మణులు మద్దతు తెలియజేయాలి

● ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ శర్మ

గుంటూరు మే 11 : గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎన్డీయే కూటమి అభ్యర్థి ఎండీ నసీర్ అహ్మద్‌కు సోమవారం జరగబోయే ఎన్నికల్లో బ్రాహ్మణులంతా మద్దతు తెలియజేసి గెలిపించాలని టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎన్డీయే కూటమి అభ్యర్థి ఎండీ నసీర్ అహ్మద్‌ను కన్యకాపరమేశ్వరి గుడి దగ్గర భారీ ర్యాలీలో బ్రాహ్మణ నాయకులతో కలసి సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం సతీష్ శర్మ మాట్లాడుతూ సౌమ్యుడు, స్నేహశీలి, సమస్యలు తెలిసిన వ్యక్తి నసీర్ అహ్మద్ అని కొనియాడారు, తూర్పు నియోజకవర్గంలోని బ్రాహ్మణులు సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నసీర్ అహ్మద్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో విదేశీ విద్య పథకం అటకెక్కించారని, 99 మంది బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ఐదేళ్ల కళ్ల కాయలుకాచేలా ఎదురు చూశారని ఆవేదన వెలిబుచ్చారు. ఇతర సామాజికవర్గాలు కోర్టులను ఆశ్రయించి విదేశీ విద్య లబ్ధిపొందారని, బ్రాహ్మణులు కోర్టులకు వెళ్ళలేక చదువులు మధ్యలో ఆపలేక అప్పులు చేసి ఇబ్బందులు పడ్డారని, ఇటువంటి పరిస్థితులు మరెవరికీ రాకూడదని అన్నారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు సీఎం అయితేనే అందరికీ మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత పాటిబండ్ల విజయ్, దాసరి శ్రీనివాస్, మన్నేపల్లి హనుమంతుశర్మ, శంకరమంచి లలితా శాస్త్రి, శ్రీనివాస్ శర్మ, తిరుమలరావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో ఇంటర్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుంటూరు(విద్య), మే 10 : ఇంటర్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం వేసవిలో ప్రైవేటు జూనియర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ సెలవుదినాలు, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు రూ.5 లక్షల వరకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. వేసవి సెలవులు పూర్తి అయ్యే వరకు జూనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

## ముగిసిన నృత్యోత్సవాలు

గుంటూరు(తూర్పు), మే 11 : స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికలో భరతముని కూచిపూడి నృత్య కళాక్షేత్రం, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన రామ లల్లా పురస్కార నృత్యోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, డాక్టర్ ఎం.సుధాకర్, ఘంటసాల పవన్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు హాజరై ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాలను ఉత్సవాల ఆర్గనైజర్ రంగమణి, కూచిపూడి భావన పర్యవేక్షించారు.



వైసీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామాంజనేయులు

## వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

పెదనందిపాడు, మే 11: మండలపరిధిలోని పమిడివారిపాలెంకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరారు. గుంటూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రత్తిపాటి రవీంద్ర పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు

పెదనందిపాడు, మే 11: పోలింగ్ బూత్‌ల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ డి.లాజరస్ అన్నారు. ఆయా గ్రామాల్లో శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌ల వద్ద బారికేడ్లు, లైటింగ్, తాగునీరు వంటి వసతులు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక అవసరాలు గల ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

## ఘనంగా వినాయక దేవాలయ వార్షికోత్సవం

పెదనందిపాడు, మే 11: మండలపరిధిలోని గోగులమూడి వరసిద్ధి వినాయక దేవస్థానం వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సిద్ధిబుద్ధి వినాయక గణపతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అనమర్లపూడిలో ధూళిపాళ్లను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫోటో)

# మంగళగిరికి.. మహర్దశ

- రాజధాని గ్రామాలు, జనసేన... లోకేశ్‌కు అదనపు అండ
- వైసీపీ అభ్యర్థికి లావణ్యకు వెన్నుపోట్ల భయం





నారా లోకేశ్ లావణ్య

మంగళగిరి, మే 11: మంగళగిరిలో టీడీపి అభ్యర్థి నారా లోకేశ్ ప్రభంజనాన్ని సృష్టించబోతున్నారు. 1985 తరువాత మంగళగిరిలో ఇంతవరకు ఎగరని పసుపుజెండాను మళ్లీ ఇన్నాళ్లకు రెపరెపలాడించే దిశగా ఎన్నికల సమరానికి సంసిద్ధులయ్యారు. ఇంకోవైపు వైసీపీ తరపున వూహించని విధంగా మురుగుడు లావణ్య అభ్యర్థిగా బరిలో నిలిచారు. లావణ్యకు రాజకీయ అనుభవం ఏమాత్రం లేకున్నప్పటికీ ఆమె అత్తింటివారు, పుట్టింటివారు ఇద్దరూ రాజకీయ కుటుంబాలకు చెందినవారే కావడం గమనార్హం. నియోజకవర్గంలో మొత్తం 40 మంది అభ్యర్థులు బరిలో వున్నప్పటికీ ప్రధానపోటీ మాత్రం టీడీపీ, వైసీపీ మధ్యే సాగుతుంది.

మంగళగిరిలో లోకేశ్ పోటీ అనేది గత రెండు మూడు మాసాలుగా ఖరారైన సంగతేమీ కాదు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన మర్నాటి నుంచే లోకేశ్ తన నియోజకవర్గం మళ్లీ మంగళగిరే నంటూ తెగేసి చెప్పేశారు. అంతేకాదు నాడు తన ఓటమికి కుంగిపోకుండా ఓటమికి గల కారణాలను గురించి సత్యాన్వేషణ చేశారు. పోలింగ్‌కు సరిగ్గా 21 రోజుల ముందర తాను అభ్యర్థిగా మంగళగిరి ప్రజల వద్దకు రావడం.. ప్రచారానికి తగినంత వ్యవధి లేకపోవడం, తానేమిటో మంగళగిరి ప్రజలకు, ప్రజా సమస్యలేమిటో తనకు తెలియకపోవడం.. ఈలోగానే పోలింగ్ ముగిసిపోవడమేనని గుర్తించారు. అందుకే ఈసారి పక్కాగా ప్రణాళిక వేసుకుని 2019 నుంచే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడం ఆరంభించారు. ఎక్కడెక్కడ ఏయే తరహా సమస్యలున్నాయో పరిశీలనాత్మకంగా గుర్తించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడి బాధితులపక్షాన గట్టిగా నిలబడ్డారు. 29 రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సొంత ఖర్చులతో నిర్వహిస్తూ వచ్చారు. ఇపుడు లోకేశ్‌కు మంగళగిరి నియోజకవర్గంలో తెలియని ఊరంటూ లేదు. గ్రామగ్రామానికి...వీధి వీధికి పరిచయాలను పెంచుకున్నారు. 2024 విజయం కోసం నాలుగేళ్ల పైనుంచి శ్రమిస్తూ వచ్చారు. అందుకే ఇపుడు లోకేశ్ చాల ధీమాగా... మరెంతో భరోసాగా వున్నారు. గత ఎన్నికల్లో 5350 ఓట్ల తేడాతో ఓడారు. ఈ ఎన్నికల్లో పక్కన ఇంకో సున్నాను చేర్చుకుని 53,500 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా లోకేశ్ మంగళగిరిలో దూసుకుపోతున్నారు. మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్న లోకేశ్ నినాదానికి ముగ్ధులై నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి అధికార, ఇతర పక్షాలకు చెందినవారు ఇబ్బడిముబ్బడిగా టీడీపీలో చేరుతూ వచ్చారు. టీడీపీలో చేరికలన్నీ చూస్తే ఓ మహా జనప్రవాహం మాదిరి కనిపించింది. అందుకే లోకేశ్ మంచి జోరుమీదున్నారు. అంతేకాదు... తాను గెలిచాక నియోజకవర్గంలో గ్రామగ్రామానికి తానేమీ చేయగలనో కూడ లోకేశ్ స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చారు. ఏయే వర్గాలవారికి ఏ రకంగా తాను ఆపన్నహస్తాన్ని అందించగలడో కూడ చెప్పేశాడు. ఏకంగా మంగళగిరి అభివృద్ధికి తన వద్ద వున్న ప్రణాళిక ఏమిటో కూడ తేటతెల్లం చేశాడు. నిజానికి రాష్ట్రంలోవున్న మరేఇతర నియోజకవర్గాలలో కూడ అభ్యర్థులెవ్వరూ గెలుపు తరువాత ఏం చేస్తాం అనే అంశపై ఇంత స్పష్టత ఇచ్చివుండరేమో! ఎంతైనా ఓ విజనరీ లీడర్ కుమారుడు కదా! అందుకే మంగళగిరి అభివృద్ధి విషయంలో తన విజన్ ఏమిటో లోకేశ్ ముందే క్లారిటీ ఇచ్చి తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు. తన లక్ష్యం ఒక్క మంగళగిరి అభివృద్ధి మాత్రమే కాదు...రాజధాని అమరావతి అభివృద్ధి కూడానన్నాడు. ప్రజాప్రభుత్వం వచ్చిన వెంటనే రూ రెండువేల కోట్లతో అమరావతిలో నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించడంతోపాటు రాజధాని రైతుల సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపుతానని స్పష్టం చేశారు. అలాగే తాడేపల్లిలో యు-1జోన్ సమస్యను కూడ సానుకూలంగా పరిష్కరించగలనని ప్రకటించారు. ప్రత్యేకించి నియోజకవర్గంలో ఎక్కడా ఒక్క ఇంటిని కదిలించేది లేదన్నారు. పైగా ప్రభుత్వ భూముల్లో నివాసం వుంటున్నవారందరికీ అక్కడే స్థిర నివేశనపట్టాలను బట్టలు పెట్టి మరీ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. పైగా లోకేశ్‌కు జనసేన అండ అదనపుబలంగా మారనుంది.

ఇంకోవైపు చూస్తే ప్రత్యర్థి పార్టీ వైసీపీ... మంగళగిరి అభివృద్ధిపై ఎలాంటి స్పష్టతను ఇవ్వలేకపోయింది. సాక్షాత్తూ ఆపార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో 45 నిమిషాలకు పైగా ప్రసంగించి కూడ మంగళగిరి అభివృద్ధిని గురించి ఒక్కటంటే ఒక్క హామీని కూడ ఇవ్వలేకపోయారు. ఓరకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి సభ మంగళగిరిలో ఆపార్టీ అభ్యర్థి లావణ్యకు లాభం చేకూర్చలేకపోగా కొత్త కష్టాలను తెచ్చిపెట్టినయింది. కనీసం చేనేతరంగం అభివృద్ధికి గానీ, నేత కార్మికుల సంక్షేమంకోసం కానీ తమ వద్ద ఎలాంటి ప్రణాళికలు వున్నాయో కూడ సీఎం జగన్ ప్రకటించలేకపోవడంతో స్థానిక చేనేతవర్గంవారు చాల నిరాశనిస్పృహలకు లోనయ్యారు. లావణ్యకు సొంత పార్టీలో పనిచేస్తున్నవారిలో ఎవరు శత్రువులో.. ఎవరు మిత్రులో తేల్చుకోలేని పరిస్థితులు దాపురించాయి. మంగళగిరి టిక్కెట్‌ను ఆశించి భంగపడినవారు లావణ్య వెంట ప్రచారంలో ఉధృతంగా తిరుగుతున్నప్పటికీ పోలింగ్ వ్యవహారంలో ఎంతవరకు చిత్తశుద్ధితో సహకరిస్తారన్నది కూడ మిలియన్ డాలర్లప్రశ్నగా మారింది. అయితే లావణ్య మాత్రం రాజకీయాలకు పూర్తిగా కొత్త అయినప్పటికీ గత రెండు మాసాలుగా మండుటెండలను సైతం లెక్కచేయకుండా చాల ఓపికగా గడపగడపకు తిరిగి ప్రచారపర్వంలో తానే ముందున్నాని మాత్రం రుజువు చేసుకున్నారు.

ఇక మంగళగిరి బరిలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు తోడు ఇండియా కూటమి తరపున జొన్నా శివశంకర్‌రావు, భారత చైతన్య యువజన పార్టీ తరపున బోడె రామచంద్ర యాదవ్, జడ శ్రావణకుమార్ వంటివారు కూడ రంగంలో వున్నారు. వీరిలో జొన్నా, బోడె చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లను పొందే అవకాశాలు వున్నాయి. అయితే వీరు సాధించుకునే ఓట్లు ప్రధాన పార్టీల తాలూకు అభ్యర్థు గెలుపోటములపైన ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోవచ్చు.

# అక్రమ మైనింగ్.. నిషేధిస్తా

- ధూళిపాళ్ల హామీ
- అక్రమ మైనింగ్‌కు సాక్షిభూతంగా అగాధాలు
- దుమ్ము కొట్టుకుపోయిన గ్రామాలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), మే11: అధికార పార్టీ అండ మాటున అక్రమ మైనింగ్‌కు సాక్ష్యంగా చేబ్రోలు మండలంలోని పలు గ్రామాలు కనిపిస్తున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో ఎర్ర గ్రావెల్ విరివిగా లభిస్తోంది. మండలంలోని శేకూరు, సుద్దపల్లి, వీరనాయకునిపాలెం, వడ్లమూడి, చేబ్రోలు తదితర గ్రామాలో గత ఐదేళ్లగా యథేచ్ఛగా అక్రమ మైనింగ్ సాగింది. అక్రమార్కుల చెరబడిన గ్రామాలు నేడు అగాధాలను తలపిస్తున్నాయి. మైనింగ్ మాఫియా దాటికి పచ్చని పంట పొలాలుగా, పండ్ల తోటలకు నెలవైన గ్రామాలు నేడు ఎటుచూసినా గ్రావెల్ మైనింగ్‌తో ఎర్రబారిపోయాయి. ఉద్యాన శాఖ అధికారుల నివేదిక ప్రకారం గడిచిన ఐదేళ్లలో 700 ఎకరాల్లో ఉద్యాన పంటలు కనుమరుగై గ్రావెల్ క్వారీలుగా మారాయి అంటే ఏ మేరకు అక్రమ మైనింగ్ జరిగిందో స్పష్టమవుతోంది. మైనింగ్ మాఫియా కన్నుపడిన పంట భూములులో రాత్రికి రాత్రే మైనింగ్ క్వారీలుగా మారిపోయాయి. గ్రావెల్ అక్రమ మైనింగ్‌పై పలు గ్రామాల వాసులు నిరసన వ్యక్తం చేసిన ప్రతిసారి మాఫియా నిర్వాహకులు అధికారంను అడ్డం పెట్టుకుని బెదిరించటంతోపాటు, పోలీసులను ఉపయోగించి బాధితులను బెదిరించి నిరసనలను విరమింప చేసారని స్వయంగా గ్రామస్తులే ఆరోపిస్తున్నారు.

**ధూళిపాళ్ళ నరేంద్ర పోరాటాలు..**

చేబ్రోలు మండలంలోని సుద్దపల్లి, శెలపాడు, వీరనాయకునిపాలెం, వడ్లమూడి గ్రామాలతోపాటు పెదకాకాని మండలంలోని అనమర్లపూడి గ్రామంలో జరుగుతున్న అక్ర మైనింగ్‌పై మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఐదేళ్లుగా గళమెత్తి పోరాడుతూనేవున్నారు. పలుమార్లు అక్రమైనింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్వారీల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన నరేంద్ర కుమార్‌ను అధికార యంత్రాంగం, పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు, గృహ నిర్భందాలు చేశారు. శేకూరు గ్రామంలో ప్రజాప్రతినిధి అండదండలతో సాగుతున్న అక్రమ మైనింగ్‌లో నరేంద్ర కుమార్ భైఠాయించి 48 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టారు. క్వారీలలో నరేంద్ర పాదయాత్ర చేసి రాష్ట్ర టీడీపీ నాయకులతో నిరసనలు సైతం చేపట్టారు. అనమర్లపూడి గ్రామంలో జరిగిన నిరసనలు రెండు రోజులు పాటు అధికార యంత్రాంగానికి నిద్రను కరువుచేశాయి. వేలాది మంది పోలీసులతో అనమర్లపూడిని దిగ్బంధం చేసినప్పటికి పోలీసుల కళ్లుకప్పి మరి నరేంద్ర అనమర్లపూడి క్వారీ చేరుకుని పోలీసుల వ్యూహాలను పటాపంచలు చేశారు. నిరసనలే కాకుండా అక్రమ మైనింగ్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులను పలు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయించారు. వీరనాయకునిపాలెం గ్రామంలో అయితే ఏకంగా దళితులకు చెందిన 100 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా తవ్వి మట్టి మాఫియా కోట్లు ఆర్జించింది. ఈ భూములను సాగుచేసుకుంటున్న చిన్న చిన్న దళిత రైతులను బెదిరించి అక్కడి నుంచి తరిమి వేసి మరి మైనింగ్ చేసారు.

**అక్రమ మైనింగ్‌ను నిషేధిస్తా : ధూళిపాళ్ళ**

చేబ్రోలు మండలంలో సాగిన అక్రమ క్వారీలు పర్యావరణానికి, ప్రజల జీవనానికి పెనుముప్పుగా మారాయి. పంట భూములు మైనింగ్‌తో జీవకలను కోల్పోయాయి. భూగర్భజలాలు అడుగంటిపోయాయి, మైనింగ్ చేసిన ఎర్ర, మట్టి వాతావరణంలో కలిసిపోయి గ్రామాలే ఎర్రబారిపోయాయి. వాతావరణ కాల్యుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ అకృత్యాలను చూసి హృదయం ద్రవిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమ గ్రావెలల్ క్వారీలను పూర్తిగా నిలిపివేయిస్తాం. అలాగే అక్రమ మైనింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.


చేబ్రోలు మండలంలో అక్రమ మైనింగ్ జరిగిన క్వారీ

# సైకిల్ గుర్తుకు ఓటు వేయడానికి సౌదీ అరేబియా నుంచి రాక

**ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి**

మాతృదేశంలో దిగజారుతున్న పరిస్థితులకు చలించి పోతున్న అనేకమంది ప్రవాసీయులు చంద్రబాబు నాయుడుకు చేయూత ఇచ్చి ఓటు వేయడానికి స్వదేశానికి వెళ్తున్నారు. తమ ఉద్యోగాలకు తాత్కాలికంగా సెలవు పెట్టి మరీ విమానమెక్కుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియాల నుంచి మొదలు అరబ్బు దేశాల వరకు అనేక మంది ఓటు వేయడానికి ఆంధ్రప్రదేశ్ కు వెళ్తున్నారు. పల్నాడు జిల్లాకు చెందిన అన్ని నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో ప్రవాసీయులు గల్ఫ్ దేశాలలో పని చేస్తున్నారు.


టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డితో షేక్ జానీ

రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలకు తాము దూరంగా ఏలా ఉంటామని సౌదీ అరేబియాలోని రియాద్‌లోని ప్రవాసీ ప్రముఖుడు, పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన షేక్ జానీ అన్నారు. మూడు రోజుల అత్యవసర సెలవు తీసుకుని మరీ ఓటు వేయడానికి వచ్చిన ఆయన తాము మాచర్లలో తెలుగు దేశం అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఓటు వేస్తానని అన్నారు. ఆయనతో పాటు యంపర్ల శ్రీనివాసరెడ్డి మరికొందరు కూడా సౌదీ అరేబియా నుండి సైకిల్ గుర్తుకు ఓటు వేయడానికి వచ్చారు.

ఎన్నికలలో ముస్లిం రిజర్వేషన్లు ఒక కీలకాంశంగా ఉండగా, పెద్ద సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ ముస్లింలు పనిచేస్తున్న గల్ఫ్ దేశాలలోని అత్యధికులు మాత్రం బీజేపీతో సంబంధం లేకుండా చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లతో సహా ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉంటారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

నరసరావుపేట, చిలకలూరిపేట, పెదకూరపాడు, వినుకొండ, సత్తెనపల్లి నియోజకవర్గాలకు చెందిన అనేకమంది కూడా ఓట్లు వేయడానికి ప్రత్యేకించి స్వదేశానికి వెళ్ళారు.

# మూడో ర్యాండమైజేషన్ పూర్తి

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాధారణ ఎన్నికలకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులుగా నియమించిన ఉద్యోగులను పోలింగ్ కేంద్రాల కేటాయింపునకు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయింది. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు నీరజ్ కుమార్, తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కార్తీకా, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని)పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాలలో రిజర్వు సిబ్బందితో కలిపి పీవోలుగా 2300 మంది, ఏపీవోలుగా 2300 మంది, ఓపిఓలుగా 9200 మంది మొత్తం 13,800 మంది ఉద్యోగులకు విధులకు గతంలో కేటాయించిన నియోజకవర్గాల్లో విధులు నిర్వహించాల్సిన పోలింగ్ కేంద్రాలనుకేటాయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఐటీ నోడల్ అధికారి రఘు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు, ఎన్ఐసీ డిఐఓ బిమల్ కుమార్, మురళి కృష్ణ పాల్గొన్నారు.


పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్, అబ్జర్వర్లు


# లోకేశ్‌కు నటుడు సుమన్ మద్దతు



మంగళగిరి సిటీ, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న నారా లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సినీ నటుడు సుమన్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మంగళగిరి ప్రజలు లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి అత్యంత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు అండగా నిలవాలని సుమన్ విజ్ఞప్తి చేశారు.

# పశ్చిమలో.. ప్రభంజనం

- ప్రచారంలో ముందు వరుసలో నిలిచిన కూటమి
- రాజకీయాలకు కొత్తైనా చొరవగా ప్రజల్లోకి..
- సొంత బిడ్డలా పశ్చిమ వాసులకు చేరువైన ఉమ్మడి అభ్యర్థి
- అన్ని వర్గాల మనసుదోచిన గల్లా మాధవి
- అదే ఒరవడి కొనసాగితే గెలుపు నల్లేరు మీద నడకే..




గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): పసుపు జెండా కంచుకోట గుంటూరు పశ్చిమలో టీడీపీ ప్రభంజనం కనిపిస్తోంది. టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి పట్ల సాధారణ ప్రజల నుంచి అసాధారణ స్పందన కనిపిస్తోంది. దాదాపు రెండునెలల పాటూ సాగిన ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. ప్రచార పర్వంలో ఆది నుంచి దూకుడుగా వున్న కూటమి అభ్యర్థి గల్లా మాధవి అదే దూకుడును చివరి వరకూ కొనసాగించారు. ఎక్కడా టెంపో తగ్గకుండా దూసుకుపోయారు.

**మంత్రి రజనీతో ఢీ అంటే ఢీ**

ప్రచారపర్వంలో ఢీ అంటే ఢీ అన్నట్లుగా కూటమి అభ్యర్థి గల్లా మాధవి దూసుకువెళ్లారు. అవతలవైపు వున్నది అసాధారణమైన ధనబలం, అధికార బలం వున్న మంత్రి విడుదల రజని అయినప్పటికీ ఎక్కడా తగ్గకుండా ఆమెకు దీటుగా ప్రచారంలో తన సత్తా చాటారు. ఒక సాధారణ మహిళగా రాజకీయరంగ ప్రవేశం చేసినా, రాజకీయాలు ఆమె పూర్తిగా కొత్తైనా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగారు. వైసీపీ పట్ల, జగన్ తీరు పట్ల ప్రజల్లో గూడు కట్టుకుని వున్న వ్యతిరేకతను పొదివి పట్టుకుని, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఆమె తన ప్రచారాన్ని కొనసాగించారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ చేరువయ్యేందుకు ఆమె గడప గడపకూ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి బాధలను సావధానంగా విన్నారు. వాటి పరిష్కారం కోసం చక్కని ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకుని, పరిష్కారం కోసం ప్రజలకు స్పష్టమైన హామీలు ఇస్తూ వారి విశ్వాసాన్ని పొందగలిగారు.




**పశ్చిమలో అశేష ఆదరణ**

పశ్చిలో ప్రతి ఇంటా ఆమె ఆశేష ఆదరణ లభించింది. తమ బిడ్డల పశ్చిమ వాసులు ఆమెను ఆదరించారు. వీర తిలకాలు దిద్దుతూ, హారతులిస్తూ, పూలవర్షాలు కురిపిస్తూ స్థానిక ప్రజలు ఆమెకు తమ సంఘీభావం తెలియజేశారు. తొలిరోజుల్లో కొంత ముందూ వెనకలున్నా ప్రజాదరణతో ఆమె నవోత్తేజం పొందారు. ప్రజల్లోకి వెళ్లాక రాటుదేలారు. తన శక్తి సామర్థ్యాలకు పదును పెటుకుని ప్రజా సమస్యలపై తన గళాన్ని బలంగా వినిపించారు. సహజంగానే ప్రజల్లో వున్న బాధ, అధికార వైసీపీపై వున్న ఆగ్రహం, టీడీపీపై వున్న అభిమానం, చంద్రబాబుపై వున్న సానుభూతి, నమ్మకం గల్లా మాధవికి కలిసివచ్చాయి. జనసేన తోడవడంతో జనసైనికులు, ప్రధానంగా కాపు వర్గాల మద్ధతు ఆమెకు కొండంత బలాన్ని ఇచ్చింది. బీజేపీ కూడా వెంట నిలవడంతో ఆ శక్తి మరింత పెరిగింది. ఆ మూడు పార్టీల కలయికతో పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ సామాజిక వర్గాలు ఆమెకు అత్యంత చేరువయ్యాయి. బీసీ మహిళ కావడంతో బీసీలంతా ఆమెకు మద్ధతుగా నిలిచారు. బీజేపీతో పొత్తులో వున్నప్పటికీ మైనార్టీలు కూటమి వైపే మొగ్గు చూపారు. వారిని చైతన్యపరచడంలో గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి, టీడీపీ శ్రేణుల చొరవ అత్యంత కీలకమైనది. అధికార వైసీపీ నుంచి రోజువారీ వలసలు పరంపరగా సాగాయి. ప్రత్యేకించి మైనార్టీ, క్రిస్టియన్, దళిత వర్గాల నుంచి ఈ వలసలు భారీగా సాగాయి. మొత్తం క్రమంలో గల్లా మాధవి అన్ని వర్గాల మన్నన పొందగలిగారు. ఇదే ఒరవడి ఎన్నికల రోజున కూడా కొనసాగితే గల్లా మాధవి గెలుపు నల్లేరు మీద నడకే!

# తూర్పు.. మార్పు!?

- కూటమి అభ్యర్థికి అనూహ్య స్పందన
- తొలి నుంచి ప్రజల్లో ఉండడంతో ఊహించని ప్రజాదరణ
- ప్రచారంలో దూసుకుపోయిన కూటమి అభ్యర్థి
- 'ప్రజా దీవెన యాత్ర'తో నెల రోజుల్లో మారిన సమీకరణాలు
- మైనార్టీ ప్రముఖుల చేరికతో రెట్టించిన బలంతో నసీర్
- ఈ సారి గెలుపు ఖాయమన్న సంకేతాలు




గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆది నుంచి తెలుగుదేశానికి ఎదురుగాలీ వీస్తుంటుంది. అందులో ఈసారి బీజేపీతో పొత్తులో వుండడంతో ఆగాలి మరింత బలంగా వీస్తుందని అందరూ భావించారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా వుంది. మైనార్టీల మద్ధతు ఈసారి కూటమికే లభిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఈసారి గెలుపు టీడీపీ- జనసేన- బీజేపీ తరుపున పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌దే అనిపిస్తోంది.

**ప్రజా సమస్యలే ఆయుధంగా..**

స్థానికుడు కావడం, అక్కడే పుట్టి, అక్కడే పెరిగి వారిలో ఒకడిగా వుండడంతో మైనార్టీలంతా ఆయన పక్షానే వున్నట్లు తెలుస్తోంది. దానికి తోడు కిందటిసారి టీడీపీ తరుపున పోరాడి ఓడిపోయాడన్న సానుభూతి ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలను వీడకుండా, ప్రజాసమస్యలను ఎజెండాగా చేసుకుని రోజువారీ పోరాటాలతో ఆయన ప్రజలకు మరింత చేరువయ్యారు. ఎన్నికల ప్రచారంలో అదే స్పష్టంగా కనిపించింది. దీనికి తోడు ఎన్నికల కోడ్ మొదలయ్యాక ఆయన చేపట్టిన ప్రజా దీవెన యాత్ర, ప్రజల ఇళ్లలోనే బస చేయడం వంటి కార్యక్రమాల్లో సామాన్యుల్లో సానుకూల చర్చకు దారితీశాయి. ఫలితంగా నెలరోజుల ప్రచార పర్వంలో ఆయనకు ఊహించని స్పందన లభించింది. ప్రజల నుంచి బలమైన మద్ధతు లభించింది.



**వైసీపీ తీరుతో అసంతృప్తి..**

అధికార వైసీపీ ముస్లిం మైనార్టీల పథకాలను రద్దు చేయడం, మైనార్టీలకు నష్టం చేసే సీఏఏ, ఎన్నార్సీ చట్టాలకు మద్ధతు ఇవ్వడం, మైనార్టీలను వెంటాడి వేదించి ఆత్మహత్యలకు పల్పాడేలా చేయడంతో వారిలో అంతర్మదనం మొదలయింది. దానికి తోడు స్థానిక ఎమ్మెల్యే ముస్తాఫా కుటుంబం, ఆయన బంధువులపై వున్న ఆరోపణలు కూడా నసీర్‌కు కలిసివచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో నసీర్ పూర్తిగా విజయవంతమయ్యారు. డ్రగ్స్, గంజాయి, ఇటీవల తలెత్తిన డయేరియా సమస్యలపై ఆయన పోరాటానికి ప్రజల్లో బలమైన మద్ధతు లభించింది. దీనికి తోడు నెలరోజులపాటు చేపట్టిన ప్రజాదీవెన యాత్రలో ఆయన స్థానిక సమస్యలను ఎండగడుతూ ముందుకు సాగారు. అదే ఇప్పుడు ఆయనకు కలిసివచ్చే అంశం. కాగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ చొరవతో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, ఆయన కుమారుడు మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ సజీల, ఆమె తండ్రి వైసీపీ నేత షేక్ షౌకత్, ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో తూర్పు నియోజకవర్గ ఎన్నికల స్వరూపమే మారిపోయింది. దానికి తోడు తాడిశెట్టి మురళి చేరికతో బీసీలు నసీర్ వైపు మొగ్గు చూపారు. వారి చేరికతో తూర్పు నియోజకవర్గంలో వైసీపీ నుంచి వేలాది కుటుంబాలు టీడీపీ వైపు చేరాయి. ఆర్యవైశ్య సంఘాలు కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నాయి. నియోజకవర్గంలో బలమైన ఓటు బ్యాంకు వున్న కాపు సామాజిక వర్గం కూడా నసీర్ వైపే నిలిచింది. మొత్తంగా చూసుకున్నప్పుడు గుంటూరు తూర్పులో ఈసారి మార్పు ఖాయంగా కనిపిస్తోంది. కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌ను గెలుపు వరించబోతున్నట్లుగా తెలుస్తోంది.

## టీడీపీ విజయం ఖాయం

● వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు, మహిళలు

దుగ్గిరాల, మే 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం తథ్యమని టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు అన్నారు. దుగ్గిరాలలో టీడీపీ నాయకులు మహిళలు, ర్యాలీ శనివారం నిర్వహించారు. ఆలీనగర్ జెండాచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్, రైలుపేట, చెన్నకేశనగర్, అంబేద్కర్‌నగర్, రామ్‌నగర్‌ల మీదుగా ముర్తుజానగర్ జెండాచెట్టు, యాదవపాలెంలో మీదుగా లైబ్రరీ వరకూ కొనసాగింది. ర్యాలీ అనంతరం వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. రానున్న కొద్ది గంటల్లో ప్రజలంతా అన్ని రకాలుగా ఆలోచించి మనకు అన్నివిధాలా మేలు చేసే వ్యక్తులైన చంద్రశేఖరరావు, లోకేశ్‌లకు అఖండ విజయం చేకూర్చాలన్నారు. తమకు అన్నివిధాలుగా సహకరించిన జనసేన, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఎన్డీఏ కూటమి విజయం రాష్ట్రంలో లాంఛనమని అన్నారు. వల్లూరు నరసింహారావు, ఎన్నారై జంపాల సుబ్బారావు, నిమ్మగడ్డ వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, రవియాదవ్, గద్దె వాసు, దేవరపల్లి చంటి, కాకా బాబు, నాయుడు బాబూరావు, ఉన్నం బాబూరావు, లంకా ఫణి సోదరులు, కీర్తి పవన్, లియాఖత్, ఖురేషి, సాదిక్, కరీముల్లా, జంపాల రాజేశ్వరి, కవిత, గద్దె శివకుమారి, గూడూరు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం అభ్యర్థి జొన్నాను గెలిపించాలి

మంగళగిరి సిటీ, మే 11: మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును గెలిపించాలని కాపు జాగృతి, కాపు జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహా కాపునాడు నేత అడపా పుల్లారావు మాట్లాడుతూ అనేక ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న కమ్యూనిస్టు నేత జొన్న శివశంకరరావును గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. జొన్న 20 సంవత్సరాలపాటు ఉండవల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేశారని తెలిపారు. జొన్నను గెలిపిస్తే పేదల పక్షాన పోరాటం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో కాపు జాగృతి రాష్ట్ర నేత జొన్నా రాజేష్, కాపు జేఏసీ నేతలు దాసరి దుర్గామల్లేశ్వరరావు, తాడికొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు పూర్వవైభవం లోకేశ్‌తోనే సాధ్యం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ

మంగళగిరి, మే 11: మంగళగిరి చేనేతకు పూర్వవైభవం తీసుకురావడం నారా లోకేశ్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి కాలనీ, సుందరయ్య నగర్, శ్రామికనగర్, సూర్యనారాయణ నగర్, ఆంజనేయ కాలనీ, వీవర్స్ కాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనలో చేనేత చిన్నాభిన్నమైందన్నారు. ప్రాభవం కోల్పోతున్న చేనేతకు ప్రాణం పోయాలని లోకేశ్ సంకల్పించారని, ఆ సంకల్పానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరిచి ఆదాయ వనరులను పెంచేందుకు లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తు తరాల గురించి ఆలోచించి చేనేత పరిశ్రమ మనుగడకు జీవం పోస్తున్న నారా లోకేశ్‌ను మంగళగిరి ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ అధ్యక్షుడు కారంపూడి అంకమ్మరావు, నేతలు అలుగూరి రాజశేఖర్, కాశిన కొండలు, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, ఆకురాతి నాగేంద్రం, చిలకా బసవమ్మ, ఒడిశా నరేష్, నందం బాబూరావు, వంగర లక్ష్మయ్య, అనుమల శ్రీను, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు, అలుగూరి వీరాంజనేయులు, తిరుమలశెట్టి హనుమంతరావు, గద్దె శ్రీమన్నారాయణ, తిరువీధుల అరుణ్‌బాబు, తుమ్మా సర్వేశ్వరరావు, శలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పంచాయతీలన్నీ నిధుల్లేక కొట్టుమిట్టాడుతున్నాయి

● పంచాయతీరాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు



సమావేశంలో పాల్గొన్న జాస్తి వీరాంజనేయులు

దుగ్గిరాల, మే 11: కేంద్ర ప్రభుత్వం పంపిన వేల కోట్ల రూపాయలను రాష్ట్రం విడుదల చేయకపోవడంతో పంచాయతీలు నిధుల్లేక కొట్టుమిట్టాడుతున్నాయని పంచాయతీరాజ్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాం జనేయులు అన్నారు. మండలంలోని కేఆర్‌కొండూరులోని కనకపుట్టలమ్మ తల్లి ఆలయంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేశ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం వీరాంజ నేయులు మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ బకాయిల పేరుతో రాష్ట్రప్రభుత్వం విద్యుత్‌శాఖకు చెల్లిస్తుందన్నారు. 42రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.998.82 కోట్లు నేటికి గ్రామపంచాయతీల ఖాతాల్లో జమచేయలేదన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిందన్నారు. సీఈవో ఆదేశాలిచ్చినప్పటికీ, ఫలితం లేకపోయిందని, తాగునీటి సమస్య, గ్రీన్ అంబాసిడర్‌లు, కార్మికుల వేతనాలు తదితర సమస్యలతో గ్రామ పంచాయతీలు సతమతమ వుతున్నాయన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ మూడు ముక్కలాటతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖరరావు, నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్‌లకు అఖండ విజయం చేకూర్చాలన్నారు. వెలివెల శ్రీనివాసరావు, పిరాట్ల పిచ్చిబాబు, ఆళ్ల సాంబశివరావు, జాస్తి అమరశేషేంద్ర, జనసేన నాయకుడు కమ్మెల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండండి

● సీఐ ఉదయ్‌బాబు

వట్టిచెరుకూరు, మే 11: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు గ్రామాల్లో విస్తృత ప్రచారం మైకుల జోరు శనివారం సాయంత్రంతో మూగబోయాయి. మండల వ్యాప్త గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా వట్టిచెరుకూరు మండల సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు తమ సిబ్బందితో విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామస్థులు ఆయా పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించడమే కాకుండా ఘర్షణలు, అలజడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో శనివారం సీఆర్‌పీ బలగాలతో రూట్ మార్చ్ నిర్వహించారు.

## ఎస్టీ, ఎస్సీ, బీసీలు జగన్‌కు ఓటెయ్యొద్దు

తాడేపల్లి టౌన్, మే 11: వైసీపీ ప్రభుత్వం 72వేల కోట్ల ఎస్సీ నిధులు దారి మళ్లించిందని, ఎస్సీ వ్యక్తిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీవారికి దక్కిందని ఎస్సీ, ఎస్టీ, బీసీలు జగన్‌కు ఓటెయ్యొద్దని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు అన్నారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపోటములను శాసించేది ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని ఆలోచించి ఓటెయ్యాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం రామారావు, సి రాజారావు, ఎన్ శంకర్, నందపు జ్వాలారావు, పి నాగరాజు పాల్గొన్నారు.

## వినాయక దేవాలయ వార్షిక వేడుకలు

పెదనందిపాడు, మే 11: మండలపరిధిలోని గోగులమూడి వరసిద్ధి వినాయక దేవస్థానం వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సిద్ధిబుద్ధి వినాయక గణపతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వైసీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామాంజనేయులు

## వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

పెదనందిపాడు, మే 11: మండలపరిధిలోని పమిడివారిపాలెంకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరారు. గుంటూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రత్తిపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్‌ను గెలిపించాలని విస్తృత ప్రచారం



నమూనా బ్యాలెట్‌తో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు


మంగళగిరి, మే 11: జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు పట్టణంలోని 14వ వార్డులో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించాయి. టీడీపీ నేత జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నమూనా బ్యాలెట్‌తో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వింజమూరి చంద్రశేఖర్, కొల్లి వేణు, కొల్లి నరసింహారావు, సోమల సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు

పెదనందిపాడు, మే 11: పోలింగ్ బూత్‌ల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ డి.లాజరస్ అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌ల వద్ద బారీకేడ్లు, లైటింగ్, తాగునీరు వంటి వసతులు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక అవసరాలు గల ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.





## తెనాలికీ.. ఓ మేనిఫెస్టో

● పది అంశాలతో విడుదల చేసిన మనోహర్

● సూపర్ సిక్స్, షణ్ముఖ వ్యూహాలతోపాటే ఇదికూడా అమలు



పది అంశాలతో కూడిన మ్యానిఫెస్టో

తెనాలి, మే 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం, ప్రజల ఆకాంక్షల మేరకు ప్రత్యేకంగా తెనాలికి ఒక మేనిఫెస్టోను రూపొందించుకున్నామని, మా కూటమి అభ్యర్థులకు సూపర్ సిక్స్ షణ్ముఖ వ్యూహాలు ఎంత ముఖ్యమో! తెనాలికోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ మేనిఫెస్టో కూడా అంతే ముఖ్యమని, నేను గెలిచాక దీనిని తప్పకుండా అమలు జరిపి తీరుతానని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మేనిఫెస్టోలోని అంశాలతో కాకుండా ప్రత్యేకంగా కృష్ణా తీర గ్రామాలకు మేలు జరిగేలా కృష్ణా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం కీలక అంశంగా తీసుకుని, దాని ఏర్పాటుకు ప్రత్యేక హామీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెనాలిని ప్రత్యేక శ్రద్ధతో మిగిలిన పట్టణాలు, నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతామని, దీనికోసమే ప్రత్యేక మ్యానిఫెస్టోను రూపొందించుకున్నట్టు వివరించారు. సమావేశంలో పది అంశాలతో కూడిన తెనాలి మేనిఫెస్టోను మనోహర్ కూటమి పార్టీల నాయకులతో కలసి విడుదల చేశారు. మ్యానిఫెస్టోలో ప్రధాన అంశాలయితే ఇవికాక మరో ముఖ్యమైన హామీ కొల్లిపర మండల ప్రజలకు కృష్ణా నదిపై చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తామన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించండి

● టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ మురళి


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, రవినాయక్, యుగంధర్ తదితరులు

తెనాలి, మారీసుపేట మే 11: రాష్ట్రంలో సుస్థిర పాలన కోసం రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి కోరారు. స్థానిక సుల్తానాబాద్‌లోని టీచర్స్ కాలనీలో శనివారం టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అధ్వర్యంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరుగుతూ బ్యాలెట్ నమూనాను చూపుతూ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రమావత్ రవినాయక్, శంకర్‌నాయక్, బిట్రా యుగంధర్, మహేష్‌నాయక్, ఎలీషా, కుంచాల నారాయణ, అనీల్, సురేష్, భాస్కర్, అయ్యప్ప, హనుమంత్, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సెబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

తెనాలి క్రైం, మే 11: పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ని నెల్లూరు నోడల్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీచేసి సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. పట్టుబడిన అక్రమ మద్యం కేసులు, ఇతర కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. సెబ్ సీఐ వెంకటాచలం, ఎస్సై పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.



## ఐదేళ్లుగా దోపిడీదారుల చేతిలో బందీగా పొన్నూరు

● సంక్షేమ పథకాలు అందక అనాథలుగా బడుగులు ● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ


మామిళ్లపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 11: గడిచిన ఐదేళ్లుగా పొన్నూరు నియోజకవర్గం దోపిడీదారుల చేతిలో బందీగా మారిందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 2024 ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా జగన్ విధ్వంసంతో పాటు దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్ల రూపంలో ఉద్యమించనున్నట్లు చెప్పారు. కూటమి పార్టీలు త్వరలోనే కొత్త ప్రభుత్వంగా రాబోతున్నారని స్పష్టమైందన్నారు. అధికారాన్ని ఉపయోగించుకుని కొంతమంది చీఫ్ సెక్రటరీ లాంటి అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూశారని ఆరోపించారు. 1.5లక్షల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ ఇంటింటికి పింఛను ఇవ్వకుండా వృద్ధులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి పంపించటానికి సంసిద్ధమయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో బడుగులు సంక్షేమ పథకాలు అందని అనాథలుగా మారిపోయారన్నారు. పొన్నూరు నియోజకవర్గం ఐదేళ్లుగా దోపిడీదారుల చేతిలో బందీగా మారిందని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు వంటి మౌలిక వసతులు కూడా పాలకులు కల్పించలేకపోయారని ఆరోపించారు. పొన్నూరుకు కొత్తగా కరకట్ట కమల్ హాసన్‌కు మించిన నటుడు వచ్చాడని అంబటి మురళీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఇష్టారీతిగా మాట్లాడుతున్న అంబటి మురళి భాగోతాలను ప్రజలముందు ఉంచామన్నారు. సత్తెనపల్లిలో రాజ్యాంగేతర శక్తిగా మారి కొండలు, గుట్టలు కనుమరుగు చేశారని ఆరోపించారు. రూ.2.60 కోట్ల డ్వాక్రా మహిళల రుణాలను తీసుకున్నట్లు అంబటి మురళి అఫిడవిట్ స్పష్టం చేస్తుందన్నారు. సత్తెనపల్లిలో ఓ డాక్టర్ భార్యను లైంగికంగా వేధించి చెరబట్టారని మీడియాలో వచ్చిన కథనాలను ప్రదర్శించామన్నారు. ప్రజల ముందు ఉంచిన తమ ఆరోపణలకు ఒక్క దానికి కూడా అంబటి మురళి ఎందుకు నోరు విప్పలేదని నరేంద్ర కుమార్ ప్రశ్నించారు. అంబటి మురళి భజరంగ్ ఫౌండేషన్‌లో ఆయన పెట్టుబడి లక్ష మాత్రమేనని ఎందుకు చెప్పటం లేదని ప్రశ్నించారు. కరోనా సమయంలో భజరంగ్ ఫౌండేషన్‌లో ఉన్న గ్రీన్ ప్రాజెక్ట్‌కు సబంధించిన మార్వాడి మరణించాడని ఆ తర్వాత ఆ ప్రాజెక్టును అంబటి మురళి కబ్జాచేసారని ఆరోపించారు. అంబటి మురళి తన కుటుంబం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కుటుంబాలనే చూడని వాడు ప్రజల భాగోగులు ఏంచూస్తాడని నిలదీశారు. ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్య గురించి నివేదికలు రూపొందించుకుని మ్యానిఫెస్టో రూపంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మన్నవ గ్రామంలో ప్రచారం చేస్తున్న ధూళిపాళ్ళ వైదీప్తి

### మామిళ్లపల్లిలో నరేంద్ర ప్రచారం

పొన్నూరు టౌన్, మే 11: మే 13వ తేదీ వచ్చే ఓట్ల సునామీతో జూన్ 4న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడుతుందని టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. శనివారం చివరి రోజు మండల పరిధిలోని మామిళ్లపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. గ్రామంలో రోడ్ షోతో పాటు ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి నరేంద్రకుమార్ మాట్లాడుతూ మామిళ్లపల్లి గ్రామంతో ధూళిపాళ్ళ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కులమత రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణంతోపాటు, మురుగు కాల్వల నిర్మాణాని టీడీపీ హయాంలో చేపట్టినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల అభ్యునతికి పాటుపడే పార్టీగా పేర్కొన్నారు. బీసీలు అభ్యున్నతి కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేసినట్లు చెప్పారు. వైసీపీ పాలనలో అన్నివర్గాలు నిరాదరణకు గురయ్యారని ఆరోపించారు. వివక్షతకు తావులేకుండా ప్రజా సంక్షేమం జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబుతో కలిసి పలు గృహాలకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మంచి భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించాలి: వైదీప్తి

పొన్నూరు టౌన్, మే 11: ప్రజలు తమ మంచి భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి కోరారు. మండల పరిధిలోని మన్నవ గ్రామంలో శనివారం ధూళిపాళ్ళ వైదీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైదీప్తికి గ్రామస్థులు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం వైదీప్తి మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించి పాలకులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రజలకు మంచి జరిగే కూటమి అభ్యర్థులను గెలిపించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వైదీప్తికి పిలుపునిచ్చారు. పొరపాట్లకు తావు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్


మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న దావులూరి సర్పంచ్, వైసీపీ నాయకులు

తెనాలి రూరల్, మే 11: మరి కొద్దిరోజుల్లో ఐదేళ్ల విధ్వంస పాలన తొలగిపోయి, చంద్రన్నపాలనతో రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కొల్లిపర మండలంకు చెందిన దావులూరు సర్పంచ్ అంబటి సంధ్యారాణి ఆమె మిత్రబృందంతో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారిని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పార్టీకి చెందిన నాయకులు సైతం ఆ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింతగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని గ్రహించి రాష్ట్రాన్ని తీర్చిదిద్ది ప్రజలకు మంచిచేసే కూటమికి మద్దతు తెలిపి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయని ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికలే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేవని విజనరీ నాయకుడు చంద్రబాబుతోనే రాష్ట్రం తిరిగి నవ్యాంధ్రగా దేశం గర్వించదగ్గ ప్రాంతంగా రూపుదిద్దుకోనుందన్నారు. తెనాలి ప్రాంతంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపించేందుకు భాగస్వాములు కావాలని ఆలపాటి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొల్లిపర మండల తెలుగు యువత అధ్యక్షుడు కోటా మార్కండేయులు, సౌపాటి కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ బొల్లు యోగానందచటర్జీ, పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు సజావుగా సాగేందుకు సమన్వయంగా పనిచేయాలి

● సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్


సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి అర్బన్, మే 11: నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల అధికారి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ చెప్పారు. జేఎంజే మహిళా కళాశాలలో శనివారం సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సెక్టార్ అధికారులు, రూట్ అధికారులను తమ పోలింగ్ స్టేషన్‌లలో అన్ని సదుపాయాలు ఉన్నదీ లేనిది విచారించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసీవ్ కేంద్రాల్లో బాధ్యత కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా పంపిణీ చేయాల్సిన ఈవీఎంలు, జనరల్ మెటీరియల్‌ను సిద్ధం చేయాలన్నారు. రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకారం అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### బయట ప్రాంతం వ్యక్తులు తక్షణం వెళ్లిపోవాలి: ఆర్వో

పొన్నూరు టౌన్, మే 11: ఎన్నికల ప్రచారం ముగిసినందున బయటి ప్రాంతాలకు చెందిన పొన్నూరుకు సంబంధం లేని వారు విడిచి వెళ్లాలని ఎన్నికల అధికారి ఎ లక్ష్మీకుమారి ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారంతో ప్రచార గడువు ముగిసిందని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కూడా ప్రచారానికి అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తెలియజేసిందన్నారు. కల్యాణ మండపంలో కమ్యూనిటీ హాల్స్, గెస్ట్ హౌస్‌లు, లాడ్జీలను తనిఖీ చేసి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలు సందర్శించేందుకు మూడు వాహనాలను మాత్రమే రిటర్నింగ్ అధికారులు అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. నియోజకవర్గానికి చెందిన రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సబంధించి సజావుగా సాగేలా ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేసినట్లు చెప్పారు. పెదకాకాని మండలంలో కొప్పురావూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1వ నెంబరు పోలింగ్ స్టేషన్‌ను మోడల్ పోలిస్టేషన్‌గా రెండో నెంబరు పోలింగ్ స్టేషన్‌ను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### అర్చకుడి గృహంలో చోరీ

పొన్నూరు టౌన్, మే 11: పొన్నూరు పట్టణంలోని అర్చకుడి గృహంలో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం పట్టణంలోని తెలగపాలెం 1వ లైన్‌లో నివశిస్తున్న అర్చకుడు రొంపిచర్ల రాజా కృష్ణమాచార్యులు శనివారం మధ్యాహ్నం వ్యక్తిగత పనులపై కుటుంబంతో సహా బంధువులు ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేలోగా చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. బీరువాలోని 60 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో వెండి సామగ్రి, 90వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాల కోసం క్లూస్ టీంను రప్పించి సోదాలు నిర్వహిస్తున్నారు.

### ప్రశాంత ఎన్నికలకు సహకరించండి: ఎస్ఐ రవీంద్రరెడ్డి

కొల్లిపర, మే 11: ఎన్నికలు సజావుగా జరిగేలా పార్టీల అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ రవీంద్రరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర, తూములూరు, దావులూరు, అత్తోట తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాటుచేసిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు.